


# పోరు తెలంగాణ
డిజిటల్ తెలుగు దినపత్రిక




కరీంనగర్ సంపుటి : 11 సంచిక : 322 శుక్రవారం 18-09-2026 ఎడిటర్ : కొండ ప్రవీణ్ కుమార్ పేజీలు : 04 వెల : 04

## సీఎం రేవంత్ రెడ్డి సోదరులపై కేటీఆర్ సంచలన ఆరోపణలు



- సీఎం సోదరులు షెల్ కంపెనీలతో లబ్ధి పొందుతున్నారని కేటీఆర్ ఆరోపణ
- టెసరాక్ కంపెనీకి రూ.200 కోట్ల విలువైన భూమి కేటాయించారని విమర్శ
- కేవలం లక్ష రూపాయల మూలధనంతో కంపెనీ ఏర్పాటు చేశారని వెల్లడి
- రేవంత్ సోదరులకు షెల్ కంపెనీలు.. భారీగా లబ్ధి: కేటీఆర్ సంచలన ఆరోపణలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు నామమాత్రపు అర్హతలతో భారీ కంపెనీలను రిజిస్టర్ చేస్తూ, - మిగతా 2 లో

# పిటిషన్లపై విచారణ జరిపిన సీజేఐ ధర్మాసనం



- ఓటుకు నోటు కేసు.. రేవంత్ రెడ్డి, సండ్ర పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ
- ఈ అంశంపై విచారణ జరిపే పరిధి ఏసీబీకి లేదన్న పిటిషనర్ల తరపు లాయర్లు
- నాటి నిబంధనల ప్రకారం ఈ అంశాన్ని ఎన్నికల ప్రక్రియగానే చూడాలని వాదన

2లో

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 'ఓటుకు నోటు' కేసుపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ఈరోజు విచారణ జరిగింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం (జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనా) విచారణ జరిపింది. తమపై నమోదైన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు చట్టపరంగా చెల్లదని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారం ముమ్మాటికీ ప్రజాప్రాతినిధ్య/ఎన్నికల నిబంధనలకు సంబంధించిందని, దీనిపై దర్యాప్తు చేసే అధికారిక పరిధి ఏసీబీకి లేదని స్పష్టం చేశారు. 2015లో కేసు నమోదైన నాటికి అమల్లో ఉన్న చట్టాలను ప్రస్తావిస్తూ... నాటి నిబంధనల

## అంతా అబద్ధం.. రేవంత్ రెడ్డి ఆరోపణలకు కవిత కౌంటర్



- ఒక్క గజం భూమి ఎక్కువ ఉన్నా ప్రభుత్వానికే అప్పగిస్తానని సవాల్
- తనతో పాటు పలువురి ఆస్తులపైనా సీబీఐ విచారణకు డిమాండ్
- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలపై ఎదురుదాడి
- గుంపు మేస్త్రీ, గుంటనక్క కలిసే ఉన్నారని కవిత విమర్శ
- ముఖ్యమంత్రిపై తమకు నమ్మకం లేదని వ్యాఖ్య

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన - మిగతా 2 లో

# భారత్‌పై 100 శాతం సుంకాలు?..

- రష్యా చమురు కొనుగోళ్లపై అమెరికా కీలక బిల్లు!
- రష్యా చమురు కొనుగోలుదారులే లక్ష్యంగా అమెరికా బిల్లు
- భారత్ నుంచి దిగుమతులపై 100 శాతం సుంకాలు విధించే అవకాశం
- ప్రతినిధుల సభలో కీలక అడ్డంకిని దాటిన బిల్లు.. నేడు తుది ఓటింగ్
- సుంకాల నుంచి మినహాయింపు ఇచ్చే అధికారం అధ్యక్షుడికి
- భారత్‌తో పాటు చైనా, హంగేరీ వంటి దేశాలపైనా ప్రభావం



2లో

రష్యాతో వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తున్న దేశాలపై కఠిన చర్యలు తీసుకునేందుకు అమెరికా సిద్ధమవుతోంది. రష్యా నుంచి అధిక మొత్తంలో చమురు కొనుగోలు చేస్తున్న భారత్ వంటి దేశాలపై ఏకంగా 100 శాతం వరకు దిగుమతి సుంకాలు (టారిఫ్‌లు) విధించడానికి వీలు కల్పించే కీలక బిల్లుకు అమెరికా ప్రతినిధుల సభలో మార్గం సుగమమైంది. 'లిండ్సే గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026' పేరుతో రూపొందించిన ఈ బిల్లుకు సంబంధించిన కీలక తీర్మానం మంగళవారం స్వల్ప మెజారిటీతో ఆమోదం పొందింది. ప్రతినిధుల సభలో ఈ తీర్మానానికి అనుకూలంగా 214 ఓట్లు, వ్యతిరేకంగా 211 ఓట్లు వచ్చాయి.

## చరిత్ర మన్మోహన్ సింగ్‌ను గౌరవంగా గుర్తుంచుకుంటుంది



- బొగ్గు కుంభకోణం కేసు క్లీన్ చిట్‌పై సోనియా గాంధీ
- మన్మోహన్ పై రాజకీయ దుష్ప్రచారాలకు తెరపడిందన్న సోనియా
- విచారణ కోర్టు తీర్పును సుప్రీంకోర్టు తప్పుపట్టడాన్ని స్వాగతించిన సోనియా
- సీబీఐ, ఈడీ వంటి సంస్థలను రాజకీయాలకు వాడుకుంటున్నారని మండిపాటు

బొగ్గు బ్లాకుల కేటాయింపు కేసులో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సుప్రీంకోర్టు క్లీన్ - మిగతా 2 లో

## 'హర్ ఘర్ తిరంగా'లో పాల్గొనాలని మోదీ పిలుపు



- ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం ఆగస్టు 15ను పండుగలా జరుపుకుందాం: మోదీ
- ఆగస్టు 15న ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం ఎగరేయాలని సూచన
- స్వాతంత్ర్య సమరయోధులకు నివాళు లర్పించాలని విజ్ఞప్తి
- 'వికసిత్ భారత్' నిర్మాణానికి ప్రతిజ్ఞ చేయాలని పిలుపు
- ఈ ఏడాది 'వందేమాతరం'కు ప్రత్యేక ప్రాధాన్యం

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ప్రజలు చురుగ్గా పాల్గొనాలని - మిగతా 2 లో




## 22ఏ భూములపై గుడ్‌న్యూస్

# సీఎం రేవంత్ కీలక హామీలు

- 22ఏ సమస్యల్లో 12 అంశాలను గుర్తించినట్లు సీఎం వెల్లడి
- యూఎల్‌సీ భూములపై త్వరలో కొత్త విధానం తీసుకొస్తామని ప్రకటన
- పెండింగ్ రిజిస్ట్రేషన్లను వారంలో పరిష్కరిస్తామని హామీ
- పొరపాటున 22ఏలో చేరిన భూములు తొలగిస్తామని భరోసా
- క్రమబద్ధీకరించిన, వేలం భూములకు 22ఏ నుంచి విముక్తి కల్పిస్తామన్న రేవంత్



2లో

22ఏ భూముల సమస్యల పరిష్కారంపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకోనుంది. 22ఏ సమస్యల్లో 12 రకాల అంశాలను గుర్తించామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో తెలిపారు. యూఎల్‌సీ భూముల విషయంలో త్వరలో కొత్త విధానం తీసుకొస్తామని చెప్పారు. అధీకృత లేఅవుట్లలో పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లను వారంలో పరిష్కరిస్తామని సీఎం ప్రకటించారు. హెచ్ఎండీఏ,

## యుద్ధ నేరాల కేసులో సిరియా మాజీ అధ్యక్షుడు అసద్‌కు మరణశిక్ష

- బషర్ అల్ అసద్‌కు మరణశిక్ష
- అసద్ తమ్ముడు మహెర్‌కూ అదే శిక్ష
- సమీప బంధువు అతీఫ్ నజీబ్‌కూ మరణశిక్ష
- యుద్ధ నేరాలు, మానవ హక్కుల ఉల్లంఘనల నేరాలపై తీర్పు
- చిన్నారుల హత్య, హింసతో దోషిగా తేలిన నజీబ్



సిరియా మాజీ అధ్యక్షుడు బషర్ అల్ అసద్‌కు మరణశిక్ష విధించారు. 14 ఏళ్ల సిరియా అంతర్యుద్ధం సమయంలో జరిగిన యుద్ధ నేరాలు, మానవ హక్కుల హననానికి సంబంధించిన కేసులో ఆయన్ను దోషిగా తేల్చిన కోర్టు కఠిన - మిగతా 2 లో

## మయన్మార్‌లో చిక్కుకున్న ఏపీ యువతను ఆదుకుంటాం

మొదటిపేజీ తరువాయి – అండగా నిలుస్తుందని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. బ్యాంకాక్‌లో ఉద్యోగాలంటూ నమ్మించి కొందరిని మయన్మార్‌కు తరలించిన నేపథ్యంలో బాధితులను సురక్షితంగా స్వస్థలాలకు రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన ఏపీ భవన్ అధికారులను ఆదేశించారు. వివరాల్లోకి వెళితే.. బ్యాంకాక్‌లో మంచి ఉద్యోగాలు ఇప్పిస్తామన్న సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మిన పలువురు నిరుద్యోగ యువకులు మయన్మార్‌లో చిక్కుకుపోయారు. ఈ విషయంపై స్పందించిన మంత్రి లోకేశ్, బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయం అందిస్తుందని స్పష్టం చేశారు. వారిని సురక్షితంగా వెనక్కి తీసుకువచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ యువతకు కీలక సూచనలు చేశారు. సైబర్ నేరగాళ్ల పన్నే ఉచ్చులో పడొద్దని, ఉద్యోగాల విషయంలో పూర్తిస్థాయిలో ఆరా తీయకుండా ఎవరినీ నమ్మవద్దని హితవు పలికారు. ఇలాంటి మోసాలపై యువత చైతన్యవంతులై అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## హస్త కళాకారులకు అండగా ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి – నిర్ణయం తీసుకుంది. వారికి అవసరమైన నాణ్యమైన కలపను ఎటువంటి లాభాపేక్ష లేకుండా, అసలు ధరకే అందించాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో 'క్రాఫ్ట్ వుడ్ బ్యాంకుల' ఏర్పాటుపై సోమవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. కలప సేకరణ, రవాణా, నిల్వకు అయ్యే వాస్తవ వ్యయాన్ని మాత్రమే వసూలు చేస్తూ చేతివృత్తుల వారికి ముడిసరుకును సరఫరా చేయాలని స్పష్టం చేశారు. ముడిసరుకు కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కళాకారులకు ఈ వుడ్ బ్యాంకులు ఒక భరోసాగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ ప్రక్రియలో దళారుల ప్రమేయాన్ని పూర్తిగా తొలగించడం ద్వారా కళాకారుల ఉత్పత్తి వ్యయం తగ్గి, వారికి ఆర్థిక భరోసా లభిస్తుందని వివరించారు. రాష్ట్రంలోని కొండపల్లి, ఏటికొప్పాక, సెట్టిగుంట, మాధవమాల, ఉదయగిరి, బొబ్బిలి వంటి ఆరు ప్రధాన కేంద్రాల్లో ఈ క్రాఫ్ట్ వుడ్ బ్యాంకులను ఏర్పాటు చేయనున్నారు. కొండపల్లి బొమ్మలకు అవసరమైన తెల్లపొనికి, ఏటికొప్పాక హస్తకళలకు వినియోగించే అంకుడు, బొబ్బిలి వీణల తయారీకి వాడే పనస, రోజ్‌వుడ్ వంటి కలపను ఈ బ్యాంకుల ద్వారా సరఫరా చేస్తారు. అలాగే, రాజమండ్రి సెంట్రల్ వుడ్ బ్యాంకులో వెదురు, టేకు వంటివి అందుబాటులో ఉంటాయి. అరుదైన కలప జాతుల లభ్యతను మ్యాపింగ్ చేసి, వాటిని అటవీ నర్సరీలలో సాగు చేసేలా చర్యలు తీసుకోవాలని పవన్ అధికారులను ఆదేశించారు.

## సీఎం రేవంత్ రెడ్డి సోదరులపై కేటీఆర్ సంచలన ఆరోపణలు

మొదటిపేజీ తరువాయి – రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పెద్ద ఎత్తున లబ్ధి పొందుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి సోదరులు బడా కంపెనీలకు యజమానులుగా మారుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. కనీసం ఒక్క ఉద్యోగి కూడా లేని కంపెనీలను చిన్న నివాసాల చిరునామాలతో రిజిస్టర్ చేయించారని పేర్కొన్నారు. అటువంటి ఒక కంపెనీకే దాదాపు రూ. 200 కోట్ల విలువైన ఐదు ఎకరాల భూమిని ప్రభుత్వం కట్టబెట్టిందని విమర్శించారు. ముఖ్యంగా, అనుముల కొండల్ రెడ్డి తన లింక్డ్‌ఇన్ ప్రొఫైల్‌లో 'టెసరాక్' కంపెనీకి ఛైర్మన్‌గా ఉన్నట్లు పేర్కొన్నారని తెలిపారు. మరో సోదరుడు జగదీశ్ రెడ్డి కాంట్రాక్టులు దక్కించుకుంటుండగా, ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డికి సింగరేణిలో కాంట్రాక్ట్ కట్టబెట్టారని ఆరోపించారు. ప్రతిపాదిత ఫోర్త్ సిటీ పరిధిలోని భూముల కేటాయింపులపై బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్ ఒకరోజు ముందే ఇవే తరహా ఆరోపణలు చేసిన నేపథ్యంలో కేటీఆర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కొండల్ రెడ్డి ఛైర్మన్‌గా ఉన్న టెసరాక్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు మహేశ్వరం మండలం రావిర్యాలలో సుమారు ఐదు ఎకరాల భూమిని కేవలం రూ. 7 కోట్లకు కేటాయించారని, దాని అసలు మార్కెట్ విలువ రూ. 100 కోట్లకు పైగా ఉంటుందని క్రిశాంక్ పేర్కొన్నారు. ఆ కంపెనీకి కేవలం రూ.లక్ష మూలధనం ఉందని, పటాన్‌చెరులోని ఒక చిన్న నివాసం నుంచి కార్యకలాపాలు సాగిస్తోందని ఆరోపించారు. కాగా, క్రిశాంక్ చేసిన ఆరోపణలను మంత్రి డి.శ్రీధర్ బాబు తీవ్రంగా ఖండించారు.

## పింగళి వెంకయ్యకు ఇచ్చే నిజమైన గౌరవం భారతరత్న మాత్రమే

మొదటిపేజీ తరువాయి – రూపొందించిన మహనీయుడు పింగళి వెంకయ్యకు అత్యున్నత పౌర పురస్కారమైన 'భారతరత్న' ప్రకటించాలని తెలంగాణ బీసీ సంక్షేమ శాఖ సలహాదారుడు, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు డిమాండ్ చేశారు. కోట్లాది మంది ప్రజల గుండెల్లో నిలిచిన త్రివర్ణ పతాకాన్ని అందించిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడికి భారత ప్రభుత్వం ఇవ్వగల ఏకైక సముచితమైన నివాళి భారతరత్న మాత్రమేనంటూ ఆయన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఓ బహిరంగ లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేస్తున్న 'హర్ ఘర్ తిరంగా' పిలుపును స్వాగతిస్తూనే... జాతీయ జెండా రూపకర్త విషయంలో కేంద్రం చూపుతున్న నిర్లక్ష్యాన్ని వీహెచ్ ఎండగట్టారు. దేశమంతటా త్రివర్ణ పతాకం సగర్వంగా రెపరెపలాడుతున్నప్పుడు, దానికి ప్రాణం పోసిన తెలుగు నేల ముద్దుబిడ్డ పింగళి వెంకయ్య సేవలను ప్రధాని మోదీ ఎందుకు విస్మరిస్తున్నారో అర్థం కావడం లేదని ఘాటుగా ప్రశ్నించారు. పింగళి వెంకయ్యకు భారతరత్న ఇస్తేనే ప్రతి భారతీయుడికి, సమరయోధుల త్యాగాలకు సరైన గౌరవం దక్కుతుందని స్పష్టం చేశారు. గతంలోనే తాను హైదరాబాద్‌లో పింగళి వెంకయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, ఇప్పటికైనా కేంద్రం స్పందించి ఈ మహత్తర నిర్ణయం తీసుకోవాలని లేఖలో కోరారు.

## డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'.. భారీ పెట్టుబడులే లక్ష్యం

మొదటిపేజీ తరువాయి – దృష్టి పెట్టాలని సూచించారు. వివిధ వ్యాపార రంగాలకు చెందిన ప్రముఖులను సదస్సులో సత్కరించేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. సంస్థాగత ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. గత ఏడాది సదస్సు తర్వాత తెలంగాణకు వచ్చిన పెట్టుబడులు, వాటి పురోగతిపై వివరాలతో నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని మరిన్ని పెట్టుబడులు సాధించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఇదే సమావేశంలో హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 పనులపైనా సీఎం సమీక్షించారు. పాతబస్తీలో ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మార్గంలో రోడ్డు విస్తరణ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మెట్రో పనులకు టెండర్ల ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు. పెండింగ్ భూసేకరణను పూర్తి చేసి విస్తరణ ప్రణాళికలను ఖరారు చేయాలని చెప్పారు. హైదరాబాద్ మెట్రోలో పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు సమకూర్చుకోవాలని అధికారులను ఆదేశించారు. పాతబస్తీ మెట్రో మార్గంలో అనుసరించాల్సిన సాంకేతికతపై ఢిల్లీ మెట్రో అధికారులతో సంప్రదించాలని సూచించారు.

## 'హర్ ఘర్ తిరంగా'లో పాల్గొనాలని మోదీ పిలుపు

మొదటిపేజీ తరువాయి – ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆగస్టు 15న ప్రతి ఇంటా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించాలని కోరారు. 'హర్ ఘర్ తిరంగా.. ఘర్ ఘర్ తిరంగా.. హర్ మన్ తిరంగా' అంటూ దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ రీల్‌ను షేర్ చేసుకున్న ప్రధాని.. ఆగస్టు 15ను గర్వంగా జరుపుకోవాలని సూచించారు. 'వికసిత్ భారత్' నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. "ప్రతి ఇంటా హర్ ఘర్ తిరంగాను ఓ వేడుకగా మార్చుకుందాం" అని పేర్కొన్నారు. ఇటీవల 'ఎక్స్' వేదికగానూ మోదీ 'హర్ ఘర్ తిరంగా'లో ఉత్సాహంగా పాల్గొనాలని ప్రజలను కోరారు. త్రివర్ణ పతాకం దేశ గర్వానికి ప్రతీక అని తెలిపారు. దేశం కోసం అత్యుత్తమంగా పనిచేయాలనే స్ఫూర్తిని అది అందిస్తుందని పేర్కొన్నారు. ఈ ఏడాది 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని 'వందేమాతరం' 150వ వార్షికోత్సవానికి అంకితం చేస్తున్నట్లు ప్రధాని తెలిపారు. దేశభక్తి, త్రివర్ణం పతాకంపై గర్వం, మాతృభూమిపై ప్రేమను చాటేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా ప్రారంభమైన 'హర్ ఘర్ తిరంగా' ద్వారా జాతీయ పతాకంతో ప్రజలకు మరింత వ్యక్తిగత అనుబంధం ఏర్పడేలా ప్రోత్సహిస్తున్నారు.

## అంతా అబద్ధం.. రేవంత్ రెడ్డి ఆరోపణలకు కవిత కౌంటర్

మొదటిపేజీ తరువాయి –భూ ఆరోపణలపై తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత తీవ్రంగా స్పందించారు. తన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తుల కంటే ఒక్క గజం భూమి అదనంగా ఉన్నట్లు నిరూపించినా, ఆ భూమిని ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె సవాల్ విసిరారు. అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి తన కుటుంబంపై అసత్య ఆరోపణలు చేశారని, ఆయన మాటలపై తమకు విశ్వాసం లేదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో వాస్తవాలు వెలుగులోకి రావాలంటే సీబీఐ విచారణకు ఆదేశించాలని ఆమె డిమాండ్ చేశారు. కేవలం తనపైనే కాకుండా, అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రస్తావించిన 'గుంటనక్క'తో పాటు కేసీఆర్ ఫాంహౌస్‌లోని సీఎం గూఢచారి, నవీన్ రావు, కొండల్ రావు, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్ రెడ్డి, రామేశ్వర్ రావు, ప్రతిమ శ్రీనివాస్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి తదితరులందరి భూములపై సమగ్ర విచారణ జరిపించాలని కవిత డిమాండ్ చేశారు. 'గుంపు మేస్త్రీ – గుంటనక్క' ముమ్మాటికీ కలిసే ఉన్నారని ఈ సందర్భంగా కవిత వ్యాఖ్యానించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కానీ, ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించిన దానికంటే గజం భూమి అదనంగా ఉన్నా ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలు, కవిత సవాల్‌తో రాష్ట్ర రాజకీయాల్లో భూముల వివాదం మరింత వేడెక్కింది.

## పరుగులు పెడుతున్న ఏపీ ఆర్థిక వ్యవస్థ.. జాతీయ సగటు కంటే మెరుగైన వృద్ధి

మొదటిపేజీ తరువాయి – అధికారులు ఈ నివేదికను సమర్పించారు. నివేదిక ప్రకారం, వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో రాష్ట్రం గణనీయమైన వృద్ధిని సాధించింది. 2025–26 రెండో త్రైమాసికంలో వ్యవసాయ రంగం 13.5 శాతం, పారిశ్రామిక రంగం 10.6 శాతం, సేవా రంగం 9.9 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ముఖ్యంగా సుగంధ ద్రవ్యాల ఉత్పత్తి 304 శాతం, వాణిజ్య వాహనాల విక్రయాలు 51.6 శాతం, ఎస్‌టిపిఐ (ఞూ×) ఎగుమతులు 32.2 శాతం మేర పెరిగాయి. సాంకేతికత వినియోగం ద్వారా జీఎస్టీ వసూళ్లు 21 శాతం వృద్ధితో రూ.13,282 కోట్లకు చేరాయి. రాష్ట్రంలోకి పెట్టుబడుల ప్రవాహం కూడా ఆశాజనకంగా ఉంది. రూ. 2.88 లక్షల కోట్ల విలువైన మెగా ప్రాజెక్టుల పెట్టుబడుల్లో 75.4 శాతం మేర గ్రౌండింగ్ పూర్తయింది. ఈ నివేదికను సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్రం ఎదుర్కొంటున్న ప్రస్తుత సవాళ్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదైందని, కృష్ణా నదిలో నీటి లభ్యత లేక శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ప్రధాన ప్రాజెక్టులు నిండలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి సంక్షోభ పరిస్థితుల్లోనూ రాష్ట్ర స్థూల ఉత్పత్తి లక్ష్యాలు దెబ్బతినకుండా పటిష్ఠమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రం 15 శాతం వృద్ధి రేటును సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం స్పష్టం చేశారు. అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ప్రజలపై ధరల భారం పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా, నియోజకవర్గం, మండలాల వారీగా నివేదికలు రూపొందిస్తే లక్ష్యాల సాధన సులభమవుతుందని పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్థిక, ప్రణాళికా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. శాంతిభద్రతలపై సీఎం చంద్రబాబు సమీక్ష 1300 మంది పోలీసులతో కీలక భేటీ రేపు శాంతిభద్రతలపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష డీజీపీ నుంచి ఎస్‌హెచ్‌ఓ వరకు 1300 మంది అధికారులతో సమావేశం గంజాయి, సైబర్ క్రైమ్, మహిళలపై నేరాల కట్టడిపై ప్రధానంగా చర్చ పోలీస్ స్టేషన్ల పనితీరుపై నివేదికలతో సమీక్షించనున్న ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం 3:30 గంటలకు సచివాలయంలో కీలకమైన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నారు. రాష్ట్ర పోలీస్ శాఖ చరిత్రలోనే అరుదుగా, డీజీపీ స్థాయి అధికారి నుంచి క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) వరకు సుమారు 1,300 మంది అధికారులు ఈ సమావేశంలో పాల్గొనబోతుండటం గమనార్హం. ఈ సమీక్షా సమావేశంలో ప్రధానంగా రాష్ట్రంలోని శాంతిభద్రతలు, మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాల నియంత్రణ, సైబర్ నేరాలు, సోషల్ మీడియా వేదికగా సాగుతున్న దుష్ప్రచారాలు, గంజాయి నిర్మూలన, బ్లేడ్ బ్యాచ్‌ల అరాచకాలకు అడ్డుకట్ట వేయడం వంటి కీలక అంశాలపై చంద్రబాబు చర్చించనున్నారు. పోలీస్ స్టేషన్ల పనితీరుపై తన వద్ద ఉన్న క్షేత్రస్థాయి నివేదికలను అధికారుల ముందుంచి, ఆయన సమగ్రంగా విశ్లేషించనున్నారు. వివిధ స్టేషన్లలో నమోదవుతున్న కేసులు, శాంతిభద్రతల పర్యవేక్షణ తీరుతెన్నులపై ముఖ్యమంత్రి నేరుగా సమీక్ష నిర్వహించనున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై, చట్టాన్ని అతిక్రమించే వారిపై ఉక్కుపాదం మోపాలని, మహిళలు, బలహీన వర్గాల రక్షణకే అత్యంత ప్రాధాన్యతనివ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సందర్భంగా పోలీసు యంత్రాంగానికి స్పష్టమైన దిశానిర్దేశం చేయనున్నారు. సచివాలయంలో జరిగే ఈ సమావేశానికి పోలీస్ ఉన్నతాధికారులు ప్రత్యక్షంగా హాజరవుతుండగా, జిల్లా స్థాయి అధికారులు, ఎస్‌హెచ్‌ఓలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొంటారు.

## చరిత్ర మన్మోహన్ సింగ్‌ను గౌరవంగా గుర్తుంచుకుంటుంది



మొదటిపేజీ తరువాయి – చిట్ ఇవ్వడం చారిత్రాత్మక ఘట్టమని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ పేర్కొన్నారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికకు ఆమె రాసిన ప్రత్యేక వ్యాసంలో... సుప్రీంకోర్టు తీర్పుతో మన్మోహన్ సింగ్‌పై ఇన్నాళ్లూ జరిగిన రాజకీయ కక్షసాధింపులకు, దుష్ప్రచారాలకు తెరపడిందని స్పష్టం చేశారు. "నాడు (2014 జనవరిలో) మన్మోహన్ సింగ్ చెప్పినట్లుగానే చరిత్ర ఆయన పట్ల చాలా దయతో, గౌరవంగా ప్రవర్తిస్తుంది" అని ఆమె గుర్తుచేశారు. సీబీఐ దాఖలు చేసిన క్లోజర్ నివేదికను ఆమోదిస్తూ, విచారణ పరిధి దాటి వ్యాఖ్యలు చేసిన విచారణ కోర్టు తీరును సుప్రీంకోర్టు తప్పుపట్టడాన్ని సోనియా గాంధీ స్వాగతించారు. మన్మోహన్ సింగ్ సమగ్రతను, మచ్చలేని రాజకీయాన్ని దెబ్బతీసేందుకు అప్పట్లో రాజకీయ ప్రత్యర్థులు, కొందరు అధికారులు మరియు మీడియా ప్రణాళికాబద్ధంగా కుట్ర పన్నారని ఆరోపించారు. ప్రస్తుత మోదీ ప్రభుత్వంపై మండిపడుతూ... సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను రాజకీయ అవసరాలకు వాడుకుంటున్నారని విమర్శించారు. యూపీఏ హయాంలో సాధించిన ఆర్థిక పురోగతి, ఉపాధి హామీ, విద్యా హక్కు, ఆహార భద్రత చట్టాల ప్రాధాన్యతను వివరిస్తూ.. మన్మోహన్ సింగ్ ప్రశాంతంగా ఉన్నప్పటికీ దేశానికి అత్యంత కీలకమైన సేవలు అందించిన ప్రధానిగా నిలిచిపోతారని కొనియాడారు.

## ఇన్‌స్టాగ్రామ్‌లో మోదీ కొత్త రీల్ ఈసారి యువతకు ప్రధాని స్పెషల్ ఛాలెంజ్



మొదటిపేజీ తరువాయి – చేతితో నేసిన వస్త్రాలను ధరించి సోషల్ మీడియాలో "+వ్ =ముఎఎ ఔష్ట్ర వీవ (+=ఔవీ)" వీడియోలు రూపొందించి పంచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా భారతీయ చేనేత సంప్రదాయాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు, చేనేత కార్మిక కుటుంబాలకు ఆర్థికంగా తోడ్పాటు అందించవచ్చని పేర్కొన్నారు. జాతీయ చేనేత దినోత్సవానికి ముందు రోజు అయిన గురువారం ప్రధాని మోదీ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఒక ప్రత్యేక రీల్‌ను విడుదల చేశారు. అందులో ఆగస్టు 7 తేదీకి ఉన్న చారిత్రక ప్రాధాన్యాన్ని గుర్తు చేశారు. 1905 ఆగస్టు 7న స్వదేశీ ఉద్యమం ప్రారంభమైందని, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రజలు స్వదేశీ వస్తువులను ప్రోత్సహిస్తూ ఐక్యంగా ముందుకు వచ్చిన రోజు ఇదేనని వివరించారు. ఇటీవల దేశవ్యాప్తంగా యువత ఫ్రెండ్‌షిప్ డేను ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారని గుర్తు చేసిన ప్రధాని, అదే ఉత్సాహంతో ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని కూడా నిర్వహించాలని కోరారు. భారతీయ చేనేతకు సంబంధించిన అవగాహన పెంచడం, సంప్రదాయ నైపుణ్యాలను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. భారతదేశంలోని చేనేత కుటుంబాలు తమ చేతులతో అద్భుతమైన వస్త్రాలను తయారు చేస్తున్నాయని ప్రధాని మోదీ కొనియాడారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో లభించే చేనేత వస్త్రాల వైవిధ్యం, కళాత్మకత ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందాయని పేర్కొన్నారు. ఈ దినోత్సవం ద్వారా వారి కృషిని గుర్తించి, వారికి మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రాచుర్యం పొందుతున్న "+వ్ =ముఎఎ ఔష్ట్ర వీవ (+=ఔవీ)" ట్రెండ్‌ను కూడా చేనేత ప్రచారానికి వినియోగించాలని ప్రధాని సూచించారు. చేనేత దుస్తులు ధరించి +=ఔవీ వీడియో రూపొందించి సోషల్ మీడియాలో పంచుకోవాలని, తద్వారా మరింత మంది చేనేత వస్త్రాలను ఉపయోగించేలా ప్రేరేపించాలని యువతకు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి కార్యక్రమాలు దేశంలో ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనకు కూడా దోహదపడతాయని ప్రధాని అభిప్రాయపడ్డారు. చిన్న, పేద చేనేత కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని చెప్పారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక చేనేత ఉత్పత్తిని కొనుగోలు చేసి, దానికి సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో పంచుకుంటే, దేశవ్యాప్తంగా ఉన్న చేనేత కళాకారుల ప్రతిభ ప్రపంచానికి మరింత చేరువ అవుతుందని పేర్కొన్నారు. భారతీయ సంప్రదాయం, స్వదేశీ ఉత్పత్తులు, చేనేత కార్మికుల జీవనోపాధికి మద్దతు ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ ప్రత్యేక పిలుపునిచ్చిన ప్రధాని, జాతీయ చేనేత దినోత్సవాన్ని ప్రజల భాగస్వామ్యంతో మరింత అర్థవంతంగా మార్చాలని ఆకాంక్షించారు. యువత సోషల్ మీడియా శక్తిని సానుకూలంగా వినియోగించి, భారతీయ చేనేతకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు.

## 22ఏ భూములపై గుడ్‌న్యూస్.. సీఎం రేవంత్ కీలక హామీలు



మొదటిపేజీ తరువాయి – డీటీసీపీ అనుమతులు ఉన్న లేఅవుట్ల రిజిస్ట్రేషన్లు కూడా చేస్తామన్నారు. ఇకపై 22ఏ జాబితాలో భూమిని చేర్చడం, తొలగించడం కోసం స్పష్టమైన నిబంధనలు తీసుకొస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. పొరపాటున వ్యక్తిగత భూములు 22ఏ జాబితాలో చేరితే కలెక్టర్లు, ఆర్డీవోలు వాటిని తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం క్రమబద్ధీకరించిన భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తామని తెలిపారు. జీవో 166, జీవో 59, జీవో 58 కింద క్రమబద్ధీకరించిన భూములకు కూడా ఇది వర్తిస్తుందన్నారు. వేలంలో కొనుగోలు చేసిన భూములు, బ్యాంకుల్లో తనఖా పెట్టి వేలం వేసిన భూములను కూడా 22ఏ జాబితా నుంచి తొలగిస్తామని చెప్పారు. ధరణి వ్యవస్థపై గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని సీఎం విమర్శించారు. నీటి ప్రాజెక్టుల తర్వాత కేసీఆర్ దృష్టి భూములపై పడిందని ఆరోపించారు. భూదోపిడీ ఆలోచనల నుంచే ధరణి పుట్టిందన్నారు. కేసీఆర్, సోమేశ్‌కుమార్ కలిసి ధరణిని రూపొందించారని చెప్పారు. ప్రభుత్వం కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టిందన్న ఆరోపణలపైనా రేవంత్ స్పందించారు. అసలు వివాదం 3.73 లక్షల ఎకరాల ప్రైవేట్ పట్టా భూముల గురించేనన్నారు. వాటిని చూపించి కోటి ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టారంటూ ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. హైకోర్టు ఆదేశాల మేరకు 2025లో నిషేధిత భూముల జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచామని సీఎం తెలిపారు.

## భారత్‌పై 100 శాతం సుంకాలు?..



ఇద్దరు డెమొక్రాట్లు రిపబ్లికన్లతో కలిసి ఓటు వేయడంతో బిల్లు తుది ఓటింగ్‌కు సిద్ధమైంది. బుధవారం ఈ బిల్లుపై తుది ఓటింగ్ జరగనుంది. ఇప్పటికే ఈ బిల్లును అమెరికా సెనేట్ 86–11 ఓట్ల భారీ ఆధిక్యంతో ఆమోదించింది. దీంతో ప్రతినిధుల సభలో కూడా ఆమోదం పొందితే, ఇది చట్టంగా మారనుంది. ఈ చట్టం అమల్లోకి వస్తే, రష్యా నుంచి అత్యధికంగా చమురు లేదా సహజవాయువును దిగుమతి చేసుకుంటున్న ఐదు దేశాల నుంచి వచ్చే వస్తువులపై 100 శాతం వరకు టారిఫ్‌లు విధించే అధికారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు లభిస్తుంది. ఈ బిల్లులో ఎక్కడా భారత్ పేరును ప్రత్యక్షంగా ప్రస్తావించలేదు. అయితే, ప్రస్తుతం రష్యా నుంచి అధికంగా చమురు కొనుగోలు చేస్తున్న దేశాల జాబితాలో భారత్ ఉంది. ఈ చట్టం అమల్లోకి వచ్చాక కూడా భారత్ టాప్–5 కొనుగోలుదారుల జాబితాలో కొనసాగితే, ఈ సుంకాల నిబంధన పరిధిలోకి వచ్చే ప్రమాదం ఉంది. భారత్‌తో పాటు చైనా, అజర్‌బైజాన్, హంగేరి, స్లోవేకియా వంటి దేశాలు కూడా ఈ కేటగిరీలో ఉన్నాయి. అయితే, ఈ సుంకాల నుంచి దేశాలకు మినహాయింపు ఇచ్చే అధికారాన్ని కూడా ఈ బిల్లు అధ్యక్షుడికి కల్పిస్తోంది. ఉక్రెయిన్‌పై యుద్ధానికి నిధులు సమకూర్చుకుంటున్న రష్యా ఇంధన ఆదాయాన్ని దెబ్బతీయడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని దీని సమర్థకులు చెబుతున్నారు. మరోవైపు, అధ్యక్షుడికి ఇంత విస్తృతమైన టారిఫ్ అధికారాలు ఇవ్వడంపై కొందరు డెమొక్రాట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ బిల్లు రష్యా నాయకత్వం, ఇంధన రంగం, చమురు రవాణాకు వాడే 'షాడో ఫ్లీట్' నౌకలపై అదనపు ఆంక్షలు విధించడంతో పాటు ఇరాన్‌పై ఉన్న ఆంక్షలను కూడా పొడిగించనుంది. గురువారం తర్వాత ప్రతినిధుల సభ సమావేశాలు విరామంలోకి వెళ్లనున్న నేపథ్యంలో ఈ బిల్లు భవితవ్యం నేడు తేలిపోనుంది.

## యుద్ధ నేరాల కేసులో సిరియా మాజీ అధ్యక్షుడు అసద్‌కు మరణశిక్ష



మొదటిపేజీ తరువాయి – శిక్ష విధించింది. అసద్ ప్రస్తుతం దేశంలో లేకపోవడం గమనార్హం. అసద్ తమ్ముడు మహెర్ అల్ అసద్‌కు కూడా ఇదే కేసులో మరణశిక్ష పడింది. సిరియా సైన్యంలో కీలక బాధ్యతలు నిర్వహించిన ఆయన.. మాజీ పాలకుడి పాలనలో సైనిక వ్యవహారాల్లో ముఖ్య పాత్ర పోషించారు. అసద్‌కు మరో దగ్గరి బంధువు అతీఫ్ నజీబ్‌కు కూడా మరణశిక్ష విధించారు. 2011లో దక్షిణ సిరియాలోని దారా ప్రావిన్స్‌లో రాజకీయ భద్రతా విభాగానికి ఆయన అధిపతిగా ఉన్నారు. ఆ సమయంలో ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలను అణచివేయడంలో కీలక పాత్ర పోషించినట్లు కోర్టు పేర్కొంది. 15 ఏళ్లలోపు చిన్నారులను ఉద్దేశపూర్వకంగా హతమార్చడం, హింసకు పాల్పడి మరణాలకు కారణం కావడం వంటి నేరాలకు నజీబ్ పాల్పడ్డారని కోర్టు నిర్ధారించింది. సిరియాలో కొత్తగా ఏర్పడిన తాత్కాలిక పాలకుల హయాంలో మాజీ ప్రభుత్వ నేతలపై జరుగుతున్న విచారణల్లో ఇది కీలక పరిణామంగా నిలిచింది. గత ప్రభుత్వంలో పనిచేసిన పలువురిపై ప్రస్తుతం కేసులు నడుస్తున్నాయి. ఇస్లామిస్ట్ నేతృత్వంలోని బలగాలు డమాస్కస్ వైపు దూసుకెళ్లడంతో 2024 డిసెంబరులో అసద్ కుటుంబంతో కలిసి సిరియా నుంచి పారిపోయారు. అనంతరం మాస్కోలో ఆశ్రయం పొందారు. మరోవైపు నజీబ్‌ను అరెస్టు చేసి విచారణకు హాజరుపరిచారు. మాజీ ప్రభుత్వంలో విచారణ ఎదుర్కొంటున్న అత్యున్నత స్థాయి అధికారుల్లో ఆయన ఒకరు.

## వన్నెల్ (బి) జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో
## బాలికలకు సైబర్ క్రైమ్ పై అవగాహన సదస్సు



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** బాల్కొండ మండలంలోని వన్నెల్ (బి) జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాలలో సైబర్ క్రైమ్ పై బాలికలకు అవగాహన కల్పించారు.సమాజంలో ఎవరైనా మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన,ఈవ్‌టీజింగ్ చేసిన షీ టీంకు సమాచారం ఇవ్వాలని,సబ్ డివిజన్ షీ టీం కానిస్టేబుళ్లు,విగ్నేష్, సుకన్య అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినిలు, ఉద్యోగినిలు, మహిళలు ఈవ్‌టీజింగ్, వేధింపులకు గురైతే పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన షీ టీంకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన మహిళలు, విద్యార్థినిల పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. ఈవ్ టీజింగ్‌కు గురయ్యేవారు భయపడకుండా సమాచారం ఇస్తే రక్షణ కల్పిస్తామన్నారు. షీ టీం నెంబర్ 8712659795కు, డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. క్యూ ఆర్ కోడ్ ద్వారా షీ టీం వారికి ఫిర్యాదు చేసే విధానాన్ని మహిళలకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానఉపాధ్యా యులు డి.సురేందర్ మరియు ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## వేంపల్లి గ్రామంలో డ్రైన్ సోక్
## పిట్స్ పనులను పర్యవేక్షించిన అధికారి

**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** ముప్కాల్ మండలంలోని వేంపల్లి గ్రామంలో నిర్మిస్తున్న డ్రైన్ సోక్ పిట్స్ పనులను గురువారం మండల అభివృద్ధి అధికారి బి.రమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు,అనంతరం నిర్దేశించిన సమయంలో పనులను పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేష్ యాదవ్,ఎఫ్ ఎ జగదీష్,ఉపాధి కూలీలు పాల్గొన్నారు.




## నల్లూర్ గ్రామంలో చేయూత పెన్షన్
## ఆన్లైన్ ప్రక్రియను ప్రారంభించిన స్పెషల్ అధికారి



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** ముప్కాల్ మండలంలోని నల్లూర్ గ్రామంలో చేయూత పెన్షన్ అప్లై చేసిన వారికి ఆర్డబ్ల్యూఎస్ సాజియా అఫ్రిన్ (పెన్షన్ స్పెషల్ ఆఫీసర్) ఇంటింటికి వెళ్లి ఆన్లైన్ చేశారు. అర్హులైన లబ్ది దారులను ఎంపిక చేసి ఆన్లైన్ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ రమేష్ తనిఖీ చేసి వివరాలను అందించారు. పెన్షన్ దరఖాస్తు దారుల పూర్తి వివరాలు సేకరించారు. సర్పంచ్ బర్కం గంగాధర్,మండల వార్డ్ సభ్యుల ఫోరం ఇంచార్జ్ ప్రవీణ్ కుమార్, కార్యదర్శి విగ్నేష్,ఎఫ్ ఏ భూమేష్, కారోబార్ గంగాధర్ పాల్గొన్నారు.

## పడగల్ గ్రామంలో
## ప్రజా పాలన దినోత్సవ వేడుకలు

**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** వేల్పూరు మండలంలో పడగల్ గ్రామపంచాయతీ ఆవరణలో తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ నల్ల రాజు మాట్లాడుతూ సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో అత్యంత ప్రాధాన్యత కలిగిన రోజని తెలిపారు. తెలంగాణ ప్రజల ఐక్యత సోదర భావం ప్రజాస్వామ్య విలువలను చాటి చెప్పే ఈ రోజును ప్రతి ఒక్కరు జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నరేందర్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.



## బాల్కొండ కాంగ్రెస్ పార్టీ
## ఆధ్వర్యంలో ప్రజా పాలన దినోత్సవ వేడుకలు



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** బాల్కొండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ విలీన దినోత్సవాన్ని మండల అధ్యక్షులు సట్ల ప్రవీణ్, పట్టణ అధ్యక్షులు కుందారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. తెలంగాణ తల్లి కి పూలమాల వేసి వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్ ఇచ్చిన తెలంగాణను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి సెక్రెటరీ యునస్,మండల సెక్రెటరీలు నవీన్ కుమార్, విద్య సాగర్, పద్మారావు, సాయన్న,రియాజ్ అలీ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు విక్కి,సెక్రెటరీ తేజ,వార్డ్ సభ్యుడు దయాకర్,బూత్ అధ్యక్షులు బండి మల్లేష్, పురుషోత్తం కాంగ్రెస్ నాయకులు మాజీ అధ్యక్షులు సంజీవ్ గౌడ్,వాహబ్,హరికృష్ణ,గడ్డం రవి,ఆరేపల్లి గంగాధర్,నానం నరేష్,పిప్పర అశోక్, మేక నాగేష్,షేరు మిగతా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## వేంపల్లి గ్రామంలో ప్రజా పాలన దినోత్సవ వేడుకలు

**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** ముప్కాల్ మండలంలోని వేంపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మహేష్ యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం నుండి నేటి వరకు రాష్ట్ర అభివృద్ధి కోసం పాటుపడిన ఉద్యమకారులు, అమర వీరులు, ప్రజల త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సునీత,పాలకవర్గ సభ్యులు, కార్యదర్శి లత, మహిళా సంఘం సభ్యులు, ప్రజలు, రైతులు పాల్గొన్నారు.



# నల్లూరు గ్రామంలో పంచాయతీ ఆద్వర్యంలో ఘనంగా స్వచ్ఛత ప్రతిజ్ఞ



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** ముప్కాల్ మండలంలోని నల్లూర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో స్వచ్ఛతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ బర్కం గంగాధర్ ఆధ్వర్యంలో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు.మహాత్మా గాంధీజీ స్వాతంత్ర్యంతో పాటు పరిశుభ్రమైన, అభివృద్ధి చెందిన భారతదేశాన్ని కలలు కన్నారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా దేశాన్ని పరిశుభ్రంగా, స్వచ్ఛంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రతిజ్ఞ చేశారు. సంవత్సరానికి 100 గంటలు, అంటే వారానికి రెండు గంటలు స్వచ్ఛత కోసం స్వచ్ఛందంగా కేటాయిస్తామని ప్రతిజ్ఞలో పేర్కొన్నారు.తాము చెత్త వేయబోమని, ఇతరులు చెత్త వేయకుండా అడ్డుకుంటామని, స్వచ్ఛత కార్యక్రమాన్ని తమతో పాటు కుటుంబం, పరిసరాలు, గ్రామం, కార్యాలయం నుంచి ప్రారంభిస్తామని ప్రతిజ్ఞ చేశారు. గ్రామాలు, పట్టణాల్లో స్వచ్ఛ భారత్ మిషన్ సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తామని, తాము చేసిన ప్రతిజ్ఞను మరో 100 మంది స్వీకరించేలా ప్రోత్సహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బర్కం లావణ్య, ముప్కాల్ మండల వార్డు మెంబర్ల ఫోరం ఇన్‌చార్జి ఏ. ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులు రాజు, పనిందర్ గౌడ్, కే.చిన్నయ్య,బి.భూమేశ్వర్, కార్యదర్శి విఘ్నేష్,అంగన్వాడీ కార్యకర్త శ్యామల, కారోబార్ గంగాధర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్, ఉపాధ్యాయుల బృందం, అంగన్వాడీ ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకలు



**పోరు తెలంగాణ ప్రతినిధి// మెట్ పల్లి :** జగ్గాసాగర్ గ్రామం లో శ్రీశ్రీశ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారీ గోవిందమాంబ ఆలయంలో జగద్గురు శ్రీ శ్రీ విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు ఇల్లెందుల రాజు ,ఉపాధ్యక్షులు నరహరి,ప్రధాన కార్యదర్శి బెజ్జారపు శ్రీధర్,కోశాధికారి బెజ్జారపు బ్రహ్మయ్య,సంఘ సభ్యులు ఇల్లెందుల కృష్ణమాచారి,ఇల్లెందుల శ్రీనివాస్,బెజ్జారపు మురళి,ఇల్లెందుల సత్యనారాయణ,కొమరోజి శ్రీనివాస్,సూపర్ శ్రీను,తగిటి సతీష్,వంగల రామస్వామి, పూసాల మోహన్,కొమరోజి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు

## నల్లూర్ గ్రామంలో తెలంగాణ
## ప్రజా పాలన దినోత్సవ వేడుకలు




**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** ముప్కాల్ మండలంలోని నల్లూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అధ్యక్షతన తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం జెండా ఆవిష్కరణ నిర్వహించారు. నిజం నిరంకుశ పాలన సెప్టెంబర్ 17 న భారత్ లో కలవడంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టినటువంటి తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం ప్రతీ ఒక్కరూ జరుపుకోవాలని తెలిపారు. ఈ ఆవిష్కరణలో ఉప సర్పంచ్ లావణ్య, ముప్కాల్ మండల వార్డు మెంబర్ ఫోరం ఇంచార్జ్ ప్రవీణ్ కుమార్, ఫోరం ఉపాధ్యక్షులు రాజు, వార్డు సభ్యులు ఫణిందర్ గౌడ్, చిన్నయ్య,భూమేశ్వర్, కార్యదర్శి విగ్నేష్,ఎఫ్ ఏ భూమేష్, అంగన్వాడీ టీచర్ శ్యామల, ఆశా వర్కర్లు రాధిక, సూర్య కళ,కారోబార్ గంగాధర్, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మద్దికల్ గ్రామపంచాయతీలో
## ఘనంగా ప్రజా పాలన దినోత్సవం






**పోరు తెలంగాణ మంచిర్యాల జిల్లా, సెప్టెంబర్ 17 :** భీమారం మండలం, మద్దికల్ గ్రామపంచాయతీలో ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పోతేం సమ్మయ్య జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా తెలంగాణ పోరాట యోధుల్ని స్మరించుకున్నారు. ఈ శ్రీకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గణేష్ , ఉప సర్పంచ్ తేజస్విని రాజు పాలకవర్గ సభ్యులు , డేగ సమ్మయ్య, నాయకులు రాజు, కారోబార్ చందు, ప్రధానోపాధ్యాయులు జనార్దన్ , ఉపాధ్యాయులు ,సునీత, ఆనంద్, అంగన్వాడీ టీచర్ వెంకటమ్మ , అపూర్వ,పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## పి హెచ్ సి ని ఆకస్మికంగా
## తనిఖీ చేసిన డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ



**పోరు తెలంగాణ నెక్కొండ సెప్టెంబర్ 17 :** ఈరోజు నెక్కొండ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ. డి ఎం హెచ్ ఓ ప్రకాష్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు.పీహెచ్సీ లో వైద్య సేవలు, సిబ్బంది హాజరు, మందుల లభ్యతను ఆయన పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 10 నుండి 16 సంవత్సరాల లోపు పిల్లలందరికీ పాఠశాలల్లోనే టి డి వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయాలని ఆదేశించారు. అదేవిధంగా 14 సంవత్సరాల బాలికలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ రాకుండా నిరోధించే హెచ్ పి వి వ్యాక్సిన్ ను 100 శాతం అమలు చేయాలని సూచించారు.శిశువులు, గర్భిణీ స్త్రీలకు ఇవ్వాల్సిన వ్యాధి నిరోధక టీకాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని హెచ్చరించారు. ప్రస్తుత సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండి, గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డా. రహేల తన్వీర్, డా. సుమన్, పీహెచ్ అన్న మేరీ, హెచ్ ఎస్ వరమ్మ, హెల్త్ అసిస్టెంట్ రవిచందర్ రెడ్డి, స్టాఫ్ నర్సులు సరిత, రజిత, నాగలక్ష్మి, యాకలక్ష్మి, సరోజ, స్వప్న తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## చేయూత పెన్షన్ వెరిఫికేషన్ ప్రక్రియ పరిశీలన

**పోరు తెలంగాణ మంచిర్యాల సెప్టెంబర్ 17 :** జైపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో చేయూత సామాజిక భద్రత పెన్షన్‌కు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రక్రియను గురువారం ఎంపీడీఓ శ్రీపతి బాపు రావు పరిశీలించారు. ఈ సందర్భంగా పెన్షన్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ, దరఖాస్తుదారుల వివరాల ధృవీకరణ తదితర అంశాలను ఆయన పరిశీలించారు. అర్హులైన దరఖాస్తుదారులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పెన్షన్ అందేలా వెరిఫికేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెరిఫికేషన్ స్పెషల్ ఆఫీసర్ బి. శ్రీనివాస్, ఎంఈఓ , జైపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి బి. ఉదయ్ కుమార్, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.



## కొడుకు మృతి తర్వాత కోడలి వేధింపులు న్యాయం
## కోసం ఆర్డిఓ ను ఆశ్రయించిన వృద్ధ దంపతులు


తేది .......... /2026

ఇట్లు
గునిగంటి కట్టయ్య
గునిగంటి సరోజన
గ్రామము : సూరిపల్లి
సెల్ : 7032201042



**పోరు తెలంగాణ నెక్కొండ, సెప్టెంబర్ 17:** నర్సంపేట డివిజన్, నెక్కొండ మండలం సూరిపల్లి గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు గునిగంటి కట్టయ్య, సరోజన న్యాయం కోసం రెవెన్యూ డివిజనల్ అధికారి (=ఋా) ని ఆశ్రయించారు. తమకు ఇద్దరు కుమారులు ఉన్నారని, పెద్ద కుమారుడు రవీందర్, చిన్న కుమారుడు రాజ్‌కుమార్ 2021లో కరోనాతో మృతి చెందాడని పిటిషన్‌లో పేర్కొన్నారు. తమకున్న 3 ఎకరాల ఖుష్కి, 2 ఎకరాల మగాని భూమిని ఇద్దరు కుమారులకు సమానంగా పంచామని, తమ జీవన పోషణ కోసం 2 ఎకరాల మగాని, 1.20 గుంటల మెట్ట భూమిని ఉంచుకున్నామని తెలిపారు. చిన్న కుమారుడు మృతి చెందిన తర్వాత ఇన్సూరెన్స్ ద్వారా వచ్చిన రూ.1.5 కోట్ల పరిహారంలో ఒక్క రూపాయి కూడా తమకు ఇవ్వలేదని, తమ బాగోగులు కూడా చూడటం లేదని చిన్న కోడలు అంజలిపై వృద్ధ దంపతులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా చిన్న కుమారుడి పేరుపై ఉన్న భూమిని కోడలు అంజలి పేరుపైకి బదలాయించా మని తెలిపారు. పెద్ద కొడుకు, కోడలు కూడా దూరంగా వెళ్లిపోవడంతో తమను చూసేవారు లేరని, అవసరాల కోసం తమ వద్ద ఉన్న కొంత భూమిని అమ్మేందుకు ప్రయత్నిస్తే, చిన్న కోడలు కొనుగోలుదారులకు ఫోన్ చేసి పోలీస్ కేసులు పెడతానని బెదిరించి అడ్డుకుంటుందని వారు వాపోయారు. తమపై దయతలచి విచారణ జరిపి, తమకు సంబంధించిన మొత్తం భూమిని తిరిగి తమకు బదలాయించాలని, రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని కోరుతూ ఆర్డిఓ కి వినతిపత్రం అందజేశారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

## మాజీ ఎంపీపీ పార్థివదేహానికి పూల మాల
## వేసి శ్రద్ధాంజలి ఘటించిన చల్లా రగోత్తం రెడ్డి



**పోరు తెలంగాణ నెక్కొండ సెప్టెంబర్ 17 :** నెక్కొండ మండలం వెంకటాపురం గ్రామ వాస్తవ్యులు నెక్కొండ మండల మాజీ ఎంపీపీ బొల్లపల్లి రాజేందర్ ఈరోజు మరణించగా వారి పార్థివదేహానికి పూల మాల వేసి శ్రద్ధాంజలి ఘటించిన రిటర్డ్ కరెంట్ ఏ ఈ చల్లా రగోత్తాం రెడ్డి చల్లా కిషన్ రెడ్డి మాజీ విద్యాకమిటి చైర్మన్ గరికపాటి కృష్ణ రావు తాళ్లపెల్లి భాస్కర్ గౌడ్ పొక్కుల కృష్ణ మూర్తి మహ్మద్ మదర్ తదితరులు పార్థివదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## కొత్తపల్లి గ్రామపంచాయతీలో
## ఘనంగా ప్రజా పాలన దినోత్సవం





**పోరు తెలంగాణ మంచిర్యాల జిల్లా సెప్టెంబర్ 17 :** భీమారం మండలం కొత్తపల్లి గ్రామపంచాయతీలో ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దుర్గం తిరుపతి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా తెలంగాణ పోరాట యోధుల్ని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వసుంధర దేవి, ఉప సర్పంచ్ దుర్గం జనార్ధన్, పాలకవర్గ సభ్యులు కలగూర రమేష్, లింగాల సంపత్, ఎఫ్ ఏ కృష్ణ, ఆకుదారి శంకర్, బోగె రవీందర్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు హీన, అంగన్వాడీ టీచర్ అరిఫా, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## బతుకమ్మ ఆట స్థలం అభివృద్ధికి సర్పంచ్
## వినతి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్య



**పోరు తెలంగాణ నెక్కొండ సెప్టెంబర్ 17 :** నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని నెక్కొండ చెరువు వద్ద అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ సర్పంచ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెండ్యాల హరిప్రసాద్ నర్సంపేట ఎమ్మెల్యే శ్రీ దొంతి మాధవ రెడ్డి గారిని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. రానున్న బతుకమ్మ పండుగ నేపథ్యంలో మహిళలు బతుకమ్మ ఆడుకోవడానికి అనువుగా చెరువు వద్ద బతుకమ్మ ఆట స్థలంలో సిసి ఫ్లోరింగ్, చెరువు మత్తడి వద్ద గైడ్ వాల్, మెట్ల నిర్మాణం, మత్తడి కింద సిసి ప్లాట్ ఫామ్స్, సెంట్రల్ లైటింగ్ మరియు పత్తిపాక రోడ్డు నుండి చెరువు కట్ట మీదికి వెళ్లేందుకు పైప్ కల్వర్టు నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.సర్పంచ్ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి బతుకమ్మ పండుగ లోపే అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పనులు త్వరలోనే ప్రారంభమవుతా యని తెలిపారు. అభివృద్ధికి హామీ ఇచ్చిన ఎమ్మెల్యే గారికి సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు, సొసైటీ డైరెక్టర్ కొల్లి వెంకటసుబ్బారెడ్డి, కాంగ్రెస్ నాయకులు మూసిన శ్రీనివాస్, పడాల రవి తదితరులు పాల్గొన్నారు.



## భీమారం మండల కేంద్రంలో ఘనంగా

# విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ వేడుకలు



**పోరు తెలంగాణ మంచిర్యాల సెప్టెంబర్ 17 :** భీమారం మండల కేంద్రంలో అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ భీమారం మండల కమిటీ ఆధ్వర్యంలో శ్రీమద్విరాట్ విశ్వకర్మ భగవాన్ యజ్ఞ మహోత్సవ పూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా విశ్వకర్మ పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షుడు పూసల రమేష్, మండల ప్రధాన కార్యదర్శి పూసల రాజేష్(రాజు) విశ్వకర్మ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం విశ్వకర్మ భగవానుడికి ప్రత్యేక యజ్ఞ పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు, అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణులు మాట్లాడుతూ, హిందూ పురాణాలు మరియు సంప్రదాయాల ప్రకారం శ్రీమద్విరాట్ విశ్వకర్మ భగవానుడు దివ్య వాస్తుశిల్పిగా, సృష్టికర్తగా కొలవబడుతున్నారని తెలిపారు. దేవతల రథాలు, ఆయుధాలు, వివిధ దివ్య నిర్మాణాలను విశ్వకర్మ భగవానుడు నిర్మించినట్లు పురాణాల్లో ప్రతీతి ఉందన్నారు. విశ్వకర్మ భగవానుడి ఐదు ముఖాల నుంచి మను, మయ, త్వష్ట, శిల్పి, విశ్వజ్ఞ అనే ఐదుగురు బ్రహ్మర్షులు ఉద్భవించారని విశ్వాసం ఉందన్నారు. అలాగే శ్రీకృష్ణుడి ద్వారకా నగరం, లంకా నగరం, ఇంద్రప్రస్థ తదితర అద్భుత నిర్మాణాలను విశ్వకర్మ నిర్మించినట్లు పురాణాలు చెబుతున్నాయని వివరించారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 17న విశ్వకర్మ జయంతిని భక్తిశ్రద్ధలతో జరుపుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా కర్మాగారాలు, పరిశ్రమలు, శిల్పశాలలు, వృత్తి కేంద్రాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీ నూతి రాంచందర్,మంచిర్యాల జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పుసాల రుద్ర శర్మ , జిల్లా ఈసీ మెంబెర్ నూతి మధుశర్మ , మండల కార్యవర్గ సభ్యులు నాశీపెల్లి రమేష్,పూసల శ్యామ్ సుందర్,గనముక్కల నర్సయ్య,వొళవోజు బ్రహ్మయ్య, పూసల కిరణ్య బాబు మేరాడి గొండ రామన్న, పాలిక రమేష్, తంగళ్లపెల్లి రమేష్, రంగు జయప్రకాష్, జి.ఎ. భరత్ భక్తులు, విశ్వబ్రాహ్మణ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం

## జాతీయ పతాకం ఆవిష్కరించిన సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్

### ప్రజా పోరాటాలతోనే నిరంకుశ పాలనకు చరమగీతం: సర్పంచ్ హరిప్రసాద్

**పోరు తెలంగాణ నెక్కొండ, సెప్టెంబర్ 17 :** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలు నెక్కొండ మేజర్ గ్రామపంచాయతీలో ఘనంగా జరిగాయి. గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన జాతీయ పతాకాన్ని మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెండ్యాల హరిప్రసాద్ ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాలాపన చేశారు ఈ సందర్భంగా సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సమానత్వం కోసం పోరాడిన వీరుల స్ఫూర్తితో తెలంగాణ మరింత అభివృద్ధి పథంలో సాగాలన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజన్నారు. భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వస్తే, తెలంగాణకు 13 నెలల తర్వాత 1948 సెప్టెంబర్ 17న స్వేచ్ఛ వచ్చింది. నాటి ప్రధాని నెహ్రూ, హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ తీసుకున్న ఉక్కు నిర్ణయంతోనే హైదరాబాద్ సంస్థానం భారత్ లో విలీనమైంది. తెలంగాణను భారతదేశంలో భాగం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుంది" అని అన్నారు. కొన్ని పార్టీలు ఓట్ల కోసం ఈ రోజును రాజకీయం చేస్తూ మతాల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ ఎప్పుడూ విద్వేష రాజకీయాలకు తావివ్వదని, అందుకే సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం లోని ప్రభుత్వం ఈ రోజును అధికారికంగా ప్రజా పాలన దినోత్సవంగా నిర్వహిస్తోందని చెప్పారు. తెలంగాణ విముక్తి కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు నివాళులు అర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సింగం శ్రావణి, మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, సొసైటీ చైర్మన్ చల్లా శ్రీపాల్ రెడ్డి, గ్రామ కార్యదర్శి దయ్యాల సదానందం, వార్డు సభ్యులు, మార్కెట్ డైరెక్టర్లు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మొండికుంటలో ఘనంగా ప్రజా పాలన దినోత్సవం



### జాతీయ జెండా ఎగురవేసిన సర్పంచ్ మర్రి సంధ్య
### మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు

**భద్రాద్రి కొత్తగూడెం, (పోరు తెలంగాణ- నియోజకవర్గం ప్రతినిధి- వల్లెపోగు రాము) అశ్వాపురం, సెప్టెంబర్ 17:-** గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి సమష్టిగా కృషి చేయాలని పిలుపు మొండికుంట: ప్రజాస్వామ్య స్ఫూర్తిని, ప్రజా పాలన విలువలను ప్రతిబింబించేలా మొండికుంట గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మొండికుంట గ్రామ సర్పంచ్ మర్రి సంధ్య జాతీయ జెండాను ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపిస్తూ జాతీయ జెండాకు గౌరవం తెలిపారు. దేశ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కృషి చేసిన మహనీయులను స్మరించుకున్నారు. తదుపరి మహనీయుల చిత్రపటాలకు సర్పంచ్ మర్రి సంధ్యతో పాటు ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ నిర్మాణంలో మహనీయులు అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో గ్రామ పంచాయతీలకు, ప్రజలకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. గ్రామస్థుల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు, విద్యుత్ తదితర అంశాలపై ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లగలమని తెలిపారు. ప్రజా పాలన అంటే ప్రజలకు అందుబాటులో ఉండే పాలన అని, గ్రామస్థుల అవసరాలు, సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని అన్నారు. గ్రామ అభివృద్ధిలో ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చలమల్ల శివారెడ్డి, వార్డు సభ్యులు రావిడి శంభారెడ్డి, కొల్లు మంగమ్మ, పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణితో పాటు గ్రామ పంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# కల్లూరులో ఘనంగా 'కోటి భగవద్గీత మహాయజ్ఞం'

### ప్రజాప్రతినిధులు, ప్రముఖులకు భగవద్గీత ప్రతుల పంపిణీ..
### జై హనుమాన్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'కోటి భగవద్గీత మహాయజ్ఞం' కార్యక్రమంలో భాగంగా కల్లూరు పట్టణంలో భగవద్గీత ప్రతుల పంపిణీ కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా, విస్తృతంగా జరిగింది.

**పోరు తెలంగాణ సత్తుపల్లి ప్రతినిధి :-** మున్సిపాలిటీ కార్యాలయంలో పంపిణీ: కల్లూరు మున్సిపల్ కార్యాలయంలోని చైర్మన్ ఛాంబర్‌లో మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయక్, వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, కల్లూరు మండల యూత్ కాంగ్రెస్ నాయకులు ఆళ్లకుంట నరసింహారావు మరియు స్థానిక కౌన్సిలర్ల సమక్షంలో భగవద్గీత ప్రతులను అందజేశారు. ముఖ్య నాయకులకు అందజేత: బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ లక్కనేని రఘు గారిని కలిసి భగవద్గీత ప్రతిని బహుకరించారు. ప్రధాని మోదీ జన్మదిన వేడుకల్లో భాగంగా: భారత ప్రధాని నరేంద్ర మోదీ గారి జన్మదిన వేడుకల సందర్భంగా బిజెపి మండల అధ్యక్షుడు గుమ్మ రామకృష్ణ మరియు పార్టీ నాయకుల సమక్షంలో భగవద్గీత పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

**ట్రస్ట్ చైర్మన్ చెవుల నరేష్ వ్యాఖ్యలు:**

"ప్రతి హిందువుకు భగవద్గీత అందించడమే మా ముఖ్య లక్ష్యం. సనాతన ధర్మాన్ని రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. రాబోయే రోజుల్లో జై హనుమాన్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో హిందూ ధర్మ ప్రచారాన్ని మరింత పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ప్రత్యేక వాహనాలను కూడా సిద్ధం చేస్తున్నాం."

**నరేష్‌కి ఘన సత్కారం:**

కోటి భగవద్గీత మహాయజ్ఞం లాంటి బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని బిజెపి కల్లూరు మండల అధ్యక్షుడు గుమ్మా రామకృష్ణ, వివిధ హిందూ సంఘాల నాయకులు మరియు బిజెపి ప్రతినిధులు



కొనియాడారు. ఈ సందర్భంగా జై హనుమాన్ సేవా ట్రస్ట్ చైర్మన్ చెవుల నరేష్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు.

# ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం



**మహేశ్వరం, సెప్టెంబర్ 17, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. గురువారం రావిరాల గ్రామంలోని సర్దార్ పటేల్ యువజన సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్ లో విలీనం చేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తి ఎంతో గొప్పదని అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తితో దేశ సమగ్రత ఐక్యతను ప్రతి ఒక్కరు కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్దార్ పటేల్ యువజన సంఘం అధ్యక్షుడు వెంకటాచారి, మాజీ కౌన్సిలర్లు ఎరుకల శివకుమార్, బోద యాదగిరిరెడ్డి, రాగనమోని మహేందర్, జిల్లా నాయకులు తలారి శ్రీనివాస్, లింగం నరసింహ, సర్దార్ పటేల్ సంఘం నాయకులు, బిజెపి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జైపూర్ ఎంపీపీ కార్యాలయం లో

# ఘనంగా ప్రజా పాలన దినోత్సవం



**పోరు తెలంగాణ, మంచిర్యాల, సెప్టెంబర్ 17 :** జైపూర్ మండలం ఎంపీపీ కార్యాలయం లో ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీపతి బాపూరావు జాతీయ పథకాన్ని ఆవిష్కరించాడు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా తెలంగాణ పోరాటంలో పాల్గొన్న యోధులను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ధర్మారం గ్రామంలో ఘనంగా

# తెలంగాణ విమోచన దినోత్సవం



**పోరు తెలంగాణ మంచిర్యాల సెప్టెంబర్ 17 :** భీమారం మండలం, ధర్మారం గ్రామపంచాయతీలో తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ దాసరి మణి దీపక్ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, తెలంగాణ విమోచన దినోత్సవం మన చరిత్రను, ప్రజల పోరాట స్ఫూర్తిని గుర్తుచేసే ముఖ్యమైన రోజని అన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుకుంటూ, గ్రామ ప్రజల ఐక్యతతో ధర్మారం గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమం, సామాజిక సమానత్వం కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, గ్రామ పెద్దలు, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్, సాగర్, ఆలం, లక్ష్మణ్ తదితరులు పాల్గొని తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

## బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా

# తెలంగాణ విమోచన దినోత్సవం



**పోరు తెలంగాణ మంచిర్యాల జిల్లా, సెప్టెంబర్ 17 :** భీమారం మండల కేంద్రంలో తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకొని బీజేపి పార్టీ మండల అధ్యక్షులు బోర్లకుంట శంకర్ జాతీయ జెండాను ఆవిష్కరించాడు , అనంతరం తెలంగణ విమోచన దినోత్సవ సందర్భాన్ని వివరిస్తూ ప్రజాస్వామ్యం కోసం ఉద్యమం ప్రజల్లో స్వేచ్ఛ రజాకర్లనుండి విముక్తి పొందడానికి రజాకార్లతో పోరాడి ఎంతో మంది రైతులు విద్యార్థులు సామాన్య ప్రజలు తమ హక్కుల కోసం పోరాడి అమరులు అయ్యారని ఉద్యమం కోసం పోరాడి అమరులు అయిన ప్రతి ఉద్యమకారునికి ఘననివాళి సమర్పిస్తున్నాని అన్నారు, ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు మాడెం శ్రీనివాస్, వేల్పుల రాజేష్ యాదవ్, బీజేపి సీనియర్ నాయకులు గౌతమ్ రెడ్డి, ఆలం బాపు, మండల ఉపాధ్యక్షుడు , సెగ్గెం మల్లేష్,కార్యదర్శి తాటి సమ్మగౌడ్, శక్తికేంద్రం ఇంఛార్జి, కొమ్ము కుమార్ యాదవ్,బూత్ అధ్యక్షులు కామెర జెనార్దన్, దారావత్ రామ్ నాయక్, మంతెన సుధాకర్, దుర్గం బాలయ్య, అనపర్తి రాజం లు పాల్గొన్నారు.

# విలువలతో కూడిన విద్యను అందించాలి



### కలెక్టర్ కె.హరిత....

**పోరు తెలంగాణ సెప్టెంబర్ 17: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్.ఎం. గార్డెన్‌లో గురువారం తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్య సంఘం (ట్రస్మా) ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి, ట్రస్మా రాష్ట్ర ప్రతినిధి శివరాత్రి యాదగిరితో కలిసి హాజరై, జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులకు బెస్ట్ టీచర్ అవార్డులు అందజేశారు. విద్యార్థులకు కేవలం విద్యాబోధన మాత్రమే కాకుండా విలువలతో కూడిన విద్యను అందించాలని కలెక్టర్ పేర్కొంది. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యను వ్యాపారంగా కాకుండా సేవా దృక్పథంతో నిర్వహించాలని, విద్యార్థులలో క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యత వంటి లక్షణాలు పెంపొందించే విధంగా బోధన కొనసాగించాలని సూచించింది. దేశ భవిష్యత్తు తరగతి గదులలోనే ఆవిష్కృతమవుతుందని, ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని తెలియజేసింది. విద్యార్థులలో ప్రతిభను వెలికితీస్తూ వారిని బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దేందుకు యాజమాన్యాలు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని కోరింది

## తిర్యాణి ఆకాంక్షిత మండల

# సమగ్ర అభివృద్ధికి సి.వై.డి.ఓ.తో ఒప్పందం



**ఫోరు తెలంగాణ సెప్టెంబర్ 17: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి ఆకాంక్షిత మండలంలో సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేసేందుకు సి.వై.డి.ఓ. సంస్థతో ఒప్పందం కుదిరింది. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్‌తో కలిసి సి.వై.డి.ఓ. ప్రతినిధులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆకాంక్షిత మండల అభివృద్ధిలో భాగంగా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడం, ప్రాథమిక మౌలిక వసతులు బలోపేతం చేయడం, ప్రభుత్వ అభివృద్ధి పథకాల ఫలాలను అర్హులైన ప్రజలకు సమర్థవంతంగా అందించడం లక్ష్యంగా చర్యలు చేపడతారు. సి.వై.డి.ఓ. ఆధ్వర్యంలో మండలంలోని ఎంపిక చేసిన 20 గ్రామాలలో విద్య, వైద్యం, సాగునీరు, తాగునీరు, పోషకాహారం తదితర రంగాలలో అవసరాలు గుర్తించి కార్యక్రమాలు అమలు చేస్తారు. విద్యా ప్రమాణాల మెరుగుదల, ఆరోగ్య సేవల బలోపేతం, సురక్షిత తాగునీటి లభ్యత, సాగునీటి వసతుల అభివృద్ధి, పోషకాహార స్థాయిల పెంపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తారు.

## ఇష్టం పేటలో తెలంగాణ విమోచన దినోత్సవం





**పోరు తెలంగాణ మంచిర్యాల సెప్టెంబర్ 17 :** తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా చెన్నూరు మండలం, కిష్టంపేట గ్రామ బస్టాండ్ దగ్గర బిజెపి చెన్నూరు మండల అధ్యక్షులు బుర్ర రాజశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమానికి కిష్టంపేట గ్రామ సర్పంచ్ రావుల తిరుమల, తిరుపతి, పంచాయితీ కార్యదర్శి సిహెచ్ మధుకర్ కార్య, భారీ రాజిరెడ్డి మాజీ సర్పంచ్ బుర్ర రాకేష్ గౌడ్ మరియు వార్డ్ మెంబర్లు గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది

## ఘనంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం బూర్గంపాడు



**సెప్టెంబర్ 17 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో ప్రజా పాలన దినోత్సవంలో భాగంగా బూర్గం పహాడ్ తహసిల్దార్ కె ఆర్ కె ప్రసాద్ జాతీయపతాకవిష్కరణ చేశారు ఈ కార్యక్రమంలో బూర్గం పహాడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పూలపెల్లి సుధాకర్ రెడ్డి, బూర్గంపహాడ్ సర్పంచ్ మందా నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బెల్లంకొండ వాసుదేవరావు, సారపాక గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులుతిరుపతి చంటి, పినపాక నియోజకవర్గం ఎస్సీ సెల్ ఇంచార్జ్ కొట్టే అనిల్ కుమార్, కాంగ్రెస్ ఎస్టీ సెల్ నాయకుడు బర్మావత్ రాంబాబు నాయక్, జిపిఓ లు ప్రసాద్, వెంకన్న, ఆర్ఐ, రెవిన్యూ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మహేశ్వరం మార్కెట్ కమిటీ కార్యాలయం లో ఘనంగా ప్రజా పాలన దినోత్సవం



**మహేశ్వరం, సెప్టెంబర్ 17, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** మహేశ్వరం మార్కెట్ కమిటీ కార్యాలయం లో ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ సభావత్ కృష్ణా నాయక్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. జాతీయ గీతాన్ని ఆలపించి ఈ సందర్భంగా మహనీయుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, డైరెక్టర్లు శివగల్ల యాదయ్య, వెంకట్ రెడ్డి, సురేందర్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు






**పోరు తెలంగాణ, మంచిర్యాల, సెప్టెంబర్ 17 :** భీమారం మండల కేంద్రంలో విశ్వకర్మ జయంతి వేడుకలను విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో విశ్వకర్మ భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో జయంతి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విశ్వకర్మ భగవానుడిని సృష్టి, నిర్మాణం, శిల్పకళ, వృత్తి నైపుణ్యాలకు ప్రతీకగా భక్తులు స్మరించుకున్నారు. భీమారం విశ్వబ్రాహ్మణ మండల అధ్యక్షుడు గర్రెపల్లి సత్యనారాయణ విశ్వబ్రాహ్మణ పతకావిష్కరణ చేశాడు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గర్రెపల్లి సత్యనారాయణ, మెరడిగొండ మురళి కందుకూరి శంకరమూర్తి చెన్నోజి మనోహర్ నాగేంద్రబాబు చెన్నోజి శ్రీను ఎంపీడీవో వీణ ఎంపీ ఓ సతీష్ రెడ్డి సూపర్డెంట్ సంజీవ స్వామి, భీమారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోడేటి రవి, కాంగ్రెస్ నాయకులు పుష్క మల్ల పున్నం చంద్, పుష్క మల్ల శ్రీనివాస్ జర్పుల రాజ్ కుమార్ కొమ్ము అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు

### ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించిన బిజెపి నేతలు..






**మహేశ్వరం, సెప్టెంబర్ 17, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ 76వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మహేశ్వరం మండల కేంద్రంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశ ప్రజల సంక్షేమం, దేశ అభివృద్ధి, జాతీయ సమైక్యత కోసం ప్రధాని నరేంద్ర మోడీ చేస్తున్న సేవలను నేతలు స్మరించుకున్నారు. ఆయనకు ఆయురారోగ్యాలు కలగాలని దేశ ప్రజలకు మరింత సేవ చేసే భాగ్యం కలగాలని ఆకాంక్షిస్తూ 76 దీపాలను వెలిగించారు. అనంతరం మహేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు టి . యాదీష్ రాష్ట్ర నాయకులు దేశానాయక్, ఓబీసీ మోర్చా కార్యదర్శి కుండె వెంకటేష్, గిరిజన మోర్చా కార్యదర్శి పాండు నాయక్, మోర్చా కార్యవర్గ సభ్యుడు పంతు నాయక్, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి సుదర్శన్ యాదవ్, జిల్లా నాయకులు హనుమంతు నాయక్, ప్రధాన కార్యదర్శి వనంపల్లి శ్రావణ్, మీడియా కన్వీనర్ మోతే యాదయ్య నాయకులు రూప్సింగ్ నాయక్, మహేందర్, పాండు, మాధవ్, రఘువీర్, గుత్తిరాజు సర్పంచులు బుగ్గని యాదమ్మ యాదయ్య, ఆండాలు కృష్ణ యాదవ్, నేనావత్ రవి నాయక్, మాజీ సర్పంచులు కాసుల సురేష్, రఘుపతి గౌడ్ ఆసుపత్రి సూపరిండెట్ రాజగోపాల్ బిజెపి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చింతిర్యాలకాలనీలో ఘనంగా ప్రజా పాలన దినోత్సవం

### జాతీయ జెండా ఎగురవేసిన సర్పంచ్: కొరస అలివేలు

### మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు

**భద్రాద్రి కొత్తగూడెం (పోరు తెలంగాణ పినపాక నియోజకవర్గం ప్రతినిధి వల్లెపోగు రాము :** గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి సమష్టిగా కృషి చేయాలని పిలుపు: చింతిర్యాలకాలనీ సర్పంచ్: ప్రజాస్వామ్య స్ఫూర్తిని, ప్రజా పాలన విలువలను ప్రతిబింబించేలా చింతిర్యాల కాలనీ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చింతిర్యాల కాలనీ గ్రామ సర్పంచ్ కొరసా అలివేలు జాతీయ జెండాను ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపిస్తూ జాతీయ జెండాకు గౌరవం తెలిపారు. దేశ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కృషి చేసిన మహనీయులను స్మరించుకున్నారు. దేశ నిర్మాణంలో మహనీయులు అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో గ్రామ పంచాయతీలకు, ప్రజలకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. గ్రామస్థుల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు, విద్యుత్ తదితర అంశాలపై ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లగలమని తెలిపారు. ప్రజా పాలన అంటే ప్రజలకు అందుబాటులో ఉండే పాలన అని, గ్రామస్థుల అవసరాలు, సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని అన్నారు. గ్రామ అభివృద్ధిలో ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. అనంతరం స్కూల్లో పిల్లలచే ప్రతిజ్ఞ చేయించి శుభ్రత పరిశుభ్రత గురించి వివరించి తడి చెత్త పొడి చెత్త దాని యొక్క లాభాల గురించి తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెన్న అశోక్ కుమార్ వార్డు మెంబర్లు కొండ్రు సురేష్ రావులపల్లి వెంకట నర్సయ్య కార్యదర్శి జ్యోతి స్కూల్ టీచర్లు ప్రశాంతి కుమారి సౌజన్య పంచాయతీ సిబ్బంది







యువకులు తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ విమోచన దినోత్సవం సైతం నిర్వహించకపోవడం సిగ్గుచేటు

### బీజేపీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్

**పోరు తెలంగాణ మంచిర్యాల సెప్టెంబర్ 17 :** ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవం అధికారికంగా వేడుకలు నిర్వహించకపోవడం సిగ్గుచేటని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ అన్నారు చెన్నూరు పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విమోచన దినోత్సవ వేడుకలో ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ జెండా ఆవిష్కరించారు అనంతరం మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో విమోచన దినం పేరుతో మాయమాటలు చెప్పిన టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చినంక పార్టీ కార్యాలయంలో విమోచన దినోత్సవం వేడుకలు నిర్వహిస్తామని ప్రకటించి తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టిందని గోల్కొండ కిల మీద నామమాత్రంగా వేడుకలు నిర్వహించి స్వాతంత్ర దినోత్సవ వేడుకలను అటుకెక్కించిందని ప్రస్తుతం తెలంగాణ లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన దినోత్సవం పేరుతో స్వతంత్ర దినోత్సవ వేడుకలను అతికెకించి వార్త ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వేలాదిమంది తెలంగాణ పోరాట యోధుల ఆత్మ బలిదానాన్ని తుంగలో తొక్కిందని ఆయన అన్నారు ప్రభుత్వం అధికారికంగా తెలంగాణ విమోచన



దినోత్సవం వేడుకలు నిర్వహిస్తున్నప్పటికీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తక్షణం వీధి వీధినా తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు అధికారికంగా నిర్వహిస్తామని ఆయన అన్నారు అనంతరం పాత బస్టాండ్ ప్రతాపరుతి మందిర్ వద్ద రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దుర్గం అశోక్ జాతీయ పతాక ఆవిష్కరణ చేశారు ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ కౌన్సిలర్లు గర్రెపల్లి శాంతా వెంకట నరసయ్య, ఏతం శివకృష్ణ పట్టణ ప్రధాన కార్యదర్శి కాగిత వెంకటేష్ మనికరావు శంకర్ సీనియర్ నాయకులు రాపర్తి వెంకటేశ్వర్లు పొన్నం లక్ష్మా గౌడ్ బిజెపి జిల్లా కార్యదర్శి మంత్రిసురేఖ రామయ్య ముత్యాల శ్రావణి ఆడప శ్రీనివాస్ ప్రసాద్ గడ్డం మల్లయ్య తుమ్మ చిరంజీవి గుజర్ గణేష్ సింగ్ విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు నడిపల్లి లక్ష్మణరావు చెన్నూరు పట్టణ ప్రముఖులు విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున ఈ



కార్యక్రమంలో పాల్గొన్నారు

## నెత్తుటి చరిత్రకు రాజకీయ రంగులా..?

## సెప్టెంబర్ 17న తెలంగాణ విద్రోహ దినోత్సవశీ ఫిరంగి రాజేశ్వర్





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 17 (పోరు తెలంగాణ న్యూస్:) :** 1947 ఆగస్టు 15 అర్ధరాత్రి దేశమంతా స్వాతంత్ర్య వెలుగుల్లో తడిసిముద్దవుతుంటే, హైదరాబాద్ సంస్థానంలో మాత్రం నిరంకుశ చీకట్లు అలాగే ఉండిపోయాయి. ఢిల్లీ ఎర్రకోటపై త్రివర్ణ పతాకం సగర్వంగా రెపరెపలాడిన వేళ, దక్కన్ పీఠభూమి నేల మీద ఆ జెండా ఎగరేయడమే పెద్ద రాజద్రోహం అయ్యింది. స్వతంత్ర దేశంలో ఉంటూనే స్వేచ్ఛావాయువులు పీల్చుకోవడానికి ఈ ప్రాంత ప్రజలకు మరో పదమూడు నెలల పాటు నిరీక్షణ తప్పలేదు, అదీ కూడా నెత్తురోడిన తర్వాతనే సాధ్యమైంది. అందుకే 1948 సెప్టెంబర్ 17 అనేది కేవలం క్యాలెండర్ లోని ఒక సాధారణ తేదీ కాదు. అదొక సుదీర్ఘ అణచివేతపై సామాన్యుడి ఆత్మగౌరవం సాధించిన చారిత్రక విజయం. నిజాం పాలన అంటే కేవలం ఒక ముస్లీం పాలకుడి పరిపాలన మాత్రమే అనుకుంటే అది వాస్తవాన్ని దాచిపెట్టడమే అవుతుంది. నిజాం పాలనంటే గడీలదొరల దోపిడీ, వెట్టిచాకిరి, భూస్వామ్య దౌర్జన్యాల విషవలయం,మతంతో సంబంధం లేకుండా బక్కోడి మీద బలిసినోడు సాగించిన అణచివేత. "బాంచన్ నీ కాల్మొక్తా" అనే దైన్యపు బానిస సంకెళ్లను తెంచుకునేందుకు పల్లెపల్లెనా తిరుగుబాటు రాజుకుంది. చాకలి ఐలమ్మ భూపోరాటం దొరల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తే, కడవెండిలో దొడ్డి కొమరయ్య చిందించిన నెత్తురు ఉద్యమానికి తొలి దివిటీ అయ్యింది. ఆ మంటలే దావానలంలా వ్యాపించి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంగా రూపుదిద్దుకున్నాయి. ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టుల కార్యాచరణ ఒకవైపు సాగుతుంటే.. కలంతో నిజాం నియంతృత్వాన్ని నిలదీసి, చేతులు నరికించుకుని ప్రాణాలర్పించిన షోయబుల్లా ఖాన్ వంటి నిఖార్సయిన పాత్రికేయుల త్యాగాలు మరోవైపు కొనసాగాయి. ఇవన్నీ ఒకెత్తయితే, అధికారాన్ని ఎలాగైనా కాపాడుకోవాలన్న తాపత్రయంతో ఖాసిం రజ్వీ ఆధ్వర్యంలోని రజాకార్లు సాగించిన నరమేధం ప్రజాజీవితాన్ని అతలాకుతలం చేసింది. పరిస్థితి విషమిస్తున్న తరుణంలో స్వతంత్ర భారత ప్రభుత్వం రంగంలోకి దిగక తప్పలేదు. నాటి కేంద్ర హోంమంత్రి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ ఉక్కు సంకల్పంతో వ్యూహరచన చేసిన 'ఆపరేషన్ పోలో' (పోలీస్ చర్య) సంస్థాన భవితవ్యాన్ని క్షణాల్లో మార్చేసింది. మేజర్ జనరల్ జె.ఎన్. చౌదరి నేతృత్వంలోని భారత సైన్యం కేవలం ఐదు రోజుల్లోనే సంస్థానాన్ని చుట్టుముట్టడంతో,సంస్థానం లోపల,బయట జరుగుతున్న పరిణామాలకు ఉక్కిరిబిక్కిరై ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ లొంగిపోక తప్పలేదు. సరిగ్గా 1948 సెప్టెంబర్ 17 సాయంత్రం డెక్కన్ రేడియో ద్వారా నిజాం లొంగుబాటును ప్రకటించడంతో శతాబ్దాల రాచరికానికి తెరపడి, హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో భాగమైంది. విచిత్రమేమిటంటే, ముప్పావు శతాబ్దం గడిచినా నేటికీ సెప్టెంబర్ 17 చుట్టూ రాజకీయ వాదోపవాదాలు సమసిపోలేదు. ఒకరు దీన్ని 'విమోచన' అంటారు, ఇంకొకరు 'విలీనం' అంటారు, మరొకరు 'జాతీయ సమైక్యత' అంటారు.ఎవరు ఏ నినాదం ఎత్తుకున్నా దాని వెనుక వారివారి ఓట్ల లెక్కలు వారికున్నాయి.ఏటా ఈ తేదీ రాగానే ఏ పేరు పెట్టాలన్న పంచాయితీలతోనే కాలం గడిపేస్తున్నారు తప్ప, ఆ పోరాటం వెనుక ఉన్న అసలైన ప్రజాస్వామ్య ఆకాంక్షలను నిష్పాక్షికంగా స్మరించుకునే విజ్ఞత కొరవడుతోంది. చరిత్రను వర్తమాన రాజకీయ కళ్లద్దాలతో చూడటం ఎంత ప్రమాదకరమో ఈ చర్చలే స్పష్టం చేస్తున్నాయి. నిజానికి ఆనాడు పోరాడింది ఏ ఒక్క వర్గమో కాదు, ఏ ఒక్క మతమో వేరొక మతం మీదనో కానేకాదు,తమ భూమి, భుక్తి, ఆత్మగౌరవం, ప్రాథమిక హక్కుల కోసం సామాన్యుడు ఎత్తిన బందూకు అది. సెప్టెంబర్ 17ను స్మరించుకోవడమంటే అధికారిక వేడుకలు జరపడానికో, గతాన్ని తవ్వి పాత గాయాలను మళ్లీ రేపడానికో పరిమితం కారాదు. నాటి అమరుల త్యాగాల పునాదులపై నిలబడ్డ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడుకోవడమే నేటి తరం ఇవ్వాల్సిన నిజమైన నివాళి.అసమానతలు తొలగిపోయి, సామాజిక న్యాయం, ఆర్థిక స్వావలంబన అట్టడుగు వర్గాల వరకు చేరినప్పుడే ఆ మహోద్యమానికి, చిందిన నెత్తుటి చుక్కకు నిజమైన సార్థకత లభిస్తుందిఅని ఫిరంగి రాజేశ్వర్ అన్నారు.

## ఘనంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం

### ప్రజా పాలనలో పారదర్శకత, అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

### నిజాం పాలన నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థకు పరివర్తన చెందిన చారిత్రక రోజు..

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 17 (పోరు తెలంగాణ న్యూస్:) :** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కామారెడ్డి కలెక్టరేట్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ మహిళా కమిషన్ గౌరవ చైర్‌పర్సన్ శ్రీమతి నేరెళ్ల శారద ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టరేట్‌కు చేరుకున్న ముఖ్య అతిథి శ్రీమతి నేరెళ్ల శారదకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం పోలీసు సిబ్బంది నుంచి ఆమె గౌరవ వందనం స్వీకరించారు. ముఖ్య అతిథి శ్రీమతి నేరెళ్ల శారద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమెతో పాటు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, జిల్లా అధికారులు అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ



సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కళాకారులు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక నేపథ్యాన్ని ప్రతిబింబించేలా వివిధ కళారూపాలను ప్రదర్శించారు. దేశభక్తి గీతాలు, తెలంగాణ జానపద నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో కార్యక్రమ ప్రాంగణం సందడిగా మారింది. కళాకారుల ప్రదర్శనలను ముఖ్య అతిథి, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది ఆసక్తిగా తిలకించి అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి శ్రీమతి నేరెళ్ల శారద మాట్లాడుతూ, తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం రాష్ట్ర చరిత్రలో ఎంతో ప్రాధాన్యత కలిగిన రోజని పేర్కొన్నారు. నిజాం పాలన నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థకు పరివర్తన చెందిన చారిత్రక ఘట్టాన్ని స్మరించుకోవడంతో పాటు, ప్రజాస్వామ్య విలువలను



పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజా పాలనలో పారదర్శక పాలన, అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి, సామాజిక సమానత్వం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం కామారెడ్డి జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిని ముఖ్య అతిథి వివరించారు. జిల్లాలో ప్రజలకు ప్రభుత్వ పథకాలు, సేవలు సమర్థవంతంగా అందేలా అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, సాంస్కృతిక కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# అస్తిత్వ పోరాట ప్రతీక తెలంగాణ

### సాయుధ పోరాటం నుండి రైతాంగ పోరాటం వరకు మరువలేని చరిత్ర..

### ప్రజా పాలన దినోత్సవం వేడుకల్లో మంత్రి లక్ష్మణ్ కుమార్..



**పోరు తెలంగాణ,కరీంనగర్, సెప్టెంబర్ 17 :** తెలంగాణ రాష్ట్రం అంటే ఒక భౌగోళిక ప్రాంతం మాత్రమే కాదని అస్తిత్వ పోరాటానికి ప్రత్యేకగా తెలంగాణ నిలుస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా కరీంనగర్ లోని పోలీస్ గ్రౌండ్స్ లో నిర్వహించిన వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి లక్ష్మణ్ కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మొదట కరీంనగర్ లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళ్లు అర్పించిన మంత్రి లక్ష్మణ్ కుమార్ చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రతో పాటు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలాంతో కలిసి వేడుకల్లో మంత్రి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లా ప్రజలను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ "తెలంగాణ ప్రజాపాలన" వేడుకలకు హాజరైన తెలంగాణ పోరాట యోధులకు, ప్రజా ప్రతినిధులకు, జిల్లా ప్రజలకు, అధికారులకు, నగర ప్రముఖులకు, జర్నలిస్టులకు, ప్రజలకు తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ సందర్భంగా నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. 17 సెప్టెంబర్ 1948 సంవత్సరంలో తెలంగాణ నిజాం చెర నుండి విముక్తి పొంది, అఖండ భారత్ లో విలీనమైంది ఈ రోజు అని గుర్తు చేశారు. ఇంతటి ప్రాముఖ్యత గల సెప్టెంబరు 17వ తేదీని "తెలంగాణ ప్రజా పాలనా దినోత్సవం"గా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ ప్రజాపాలన వేడుకలు ఘనంగా నిర్వహించుకుంటున్నామని, తెలంగాణ రాష్ట్రం అనేది ఒక భౌగోళిక స్వరూపం మాత్రమే కాదని ఇది ఒక అస్తిత్వ పోరాటానికి ప్రతీక అని మంత్రి అన్నారు. అనాదిగా అణగదొక్కబడిన తెలంగాణ ప్రాంతంలో స్వేచ్ఛ, స్వాతంత్ర్యాల కోసం దశాబ్దాలుగా పోరాటాలు నిరంతరం కొనసాగాయని అన్నారు. నాటి ప్రఖ్యాతి గాంచిన "తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం" నుండి నేటి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు వరకు ఉవ్వెత్తున చేసిన అనేక పోరాటాలు చరిత్రలో ప్రసిద్ధిగాంచాయని అన్నారు. తెలంగాణ గడ్డపై జన్మించి ఈ ప్రాంతాన్ని సుసంపన్నం చేసిన ఆనాటి వీరయోధులకు జోహార్లు అర్పిస్తున్నమని మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తోందని మంత్రి తెలిపార. "తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం" పురస్కరించుకుని మన జిల్లాలో అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "మహాలక్ష్మీ" పథకంలో భాగంగా 9 డిసెంబర్ 2023న ప్రారంభించిన మహిళలకు ఉచిత బస్సు రవాణా సౌకర్యాన్ని జిల్లాలో మహిళలు, బాలికలు సద్వినియోగం చేసుకుంటున్నారని ఇప్పటి వరకు రూ. 8 కోట్ల 38 లక్షల ప్రయాణాలు చేసి, తద్వారా రూ. 383 కోట్ల 56 లక్షల రూపాయల లబ్ధి పొందారని మంత్రి తెలిపారు. వీపౌరసరఫరాల శాఖ ద్వారా కరీంనగర్ జిల్లాలో ఇప్పటి వరకు ఒక లక్షా 58 వేల లబ్దిదారులకు 11 లక్షల 93 వేల గ్యాస్ సిలిండర్లను 500 రూపాయలకే సరఫరా చేయడం జరిగిందని ఇందుకు గాను 39 కోట్ల 44 లక్షల రూపాయల సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం చెల్లించిందని వివరించారు. "గృహజ్యోతి" పథకం ద్వారా 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడే వినియోగదారులందరికి జీరో బిల్లులు జారీ చేస్తోందని జిల్లాలో ఒక లక్షా 73 వేల 627 సర్వీసులకు గాను ఇప్పటివరకు రూ. 190 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించిందని వివరించారు. "రైతుభరోసా" పథకం ద్వారా ఈ వానాకాలం పంటకు గాను ఒక లక్షా 92 వేల 628 మంది రైతులకు 206 కోట్ల 82 లక్షల రూపాయలను జమ చేయడం జరిగిందని గత యాసంగిలో సన్నరకం ధాన్యం విక్రయించిన 28 వేల 659 మంది రైతులకు 71 కోట్ల 17 లక్షల రూపాయల బోనస్ జమ చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. జిల్లాలో మొదటి విడతలో 10 వేల 969 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరిగిందని ఇప్పటికే 8 వేల 974 ఇండ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని గృహ నిర్మాణాన్ని బట్టి దశలవారీగా ప్రభుత్వం 222 కోట్ల రూపాయలను లబ్ధిదారుల ఖాతాలలో జమ చేసిందని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. రెండవ విడతలో ప్రతి నియోజకవర్గానికి 1500 ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశామని డబుల్ బెడ్ రూమ్ గృహ నిర్మాణంలో భాగంగా 2 వేల 769 ఇండ్లు ప్రారంభించగా ఒక వెయ్యి 296 పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. అంతేకాకుండా ఇంటి పైకప్పు మార్చుకునేందుకు ప్రతి నియోజకవర్గానికి 500 మంది లబ్ధిదారులకు అవకాశం కల్పిస్తున్నామని ఇందుకోసం ప్రతి గృహానికి రెండు లక్షల రూపాయల ఆర్థిక సాయం అందజేస్తామని తెలిపారు. జిల్లాలో ఒక లక్ష 30 వేల 42 మంది లబ్దిదారులకు ప్రతి నెలా 29 కోట్ల 99 లక్షల రూపాయల చేయూత పింఛన్లు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. అర్హులైన మరింత మందికి కొత్త పింఛన్లు అందించేందుకు ఇంటింటి సర్వే పూర్తయిందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. కరీంనగర్ జిల్లాలో ఇప్పటి వరకు 47 వేల 798 కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయడం జరిగిందని 98 వేల 482 మంది కుటుంబ సభ్యుల పేర్లను కొత్తగా నమోదు చేశామని జిల్లాలో 3 లక్షల 22 వేల 198 కుటుంబాలకు గాను ప్రతి నెలా 6 వేల 63 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం రేషన్ దుకాణాల ద్వారా పంపిణి చేస్తున్నామని రేషన్ కార్డుదారులందరికీ స్మార్ట్ కార్డుల పంపిణీ ప్రక్రియ కొనసాగుతోందని మంత్రి లక్ష్మణ్ కుమార్ వివరించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ఈ సంవత్సరం 25 వేల 88 మందికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించడం జరిగింది. అందుకు 72 కోట్ల 50 లక్షల రూపాయలను ప్రభుత్వం నెట్ వర్క్ ఆసుపత్రులకు చెల్లించడం జరిగిందని మంత్రి తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 391 మహిళా సంఘాలకు స్వంత భవనాలు నిర్మించేందుకు అనుమతి మంజూరు చేశామని ఈ ఏడాది ఒక లక్ష 50 వేల ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 99 రోజుల పాటు చేపట్టిన "ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో 4 వేల 290 పెండింగ్ ఫైళ్లను పరిష్కరించారని అన్ని గ్రామాలలో 15 రోజుల ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించామని చొప్పదండి మండలం కోనేరుపల్లి, రామడుగు మండలం వెలిచాల గ్రామాలు ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా గుర్తింపు పొందడం విశేషంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన "భూభారతి చట్టం" అమల్లో భాగంగా భూవివాదాలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సమగ్ర భూసర్వే కు శ్రీకారం చుట్టామని తొలిదశలో జిల్లాలో 70 గ్రామాలు నోటిఫై చేశామని మొదటి విడతలో 7, రెండో విడతలో 9 గ్రామాల్లో భూముల రీసర్వే చేస్తున్నమని మూడో విడతలో మరో 15 గ్రామాల్లో రీసర్వే చేపట్టబోతున్నామని మంత్రి తెలిపారు. అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించి సరిహద్దులను పకడ్బందీగా నిర్ణయిస్తున్నమని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జిల్లాలోని ఇల్లందకుంట, గన్నేరువరం తహసిల్దార్ కార్యాలయాలకు, హుజురాబాద్, తిమ్మాపూర్, గంగాధర సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు నూతన భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరు అయ్యాయని ఎల్ నినో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఆరుతడి పంటలు, పప్పు దినుసులు, నూనె గింజలు, తృణ ధాన్యాలు, కూరగాయల సాగు ప్రోత్సహిస్తున్నమని మంత్రి అడ్లూరి అన్నారు. రైతులకు దీర్ఘకాలం ఆదాయం వచ్చే ఆయిల్ ఫాం పంటలను ప్రోత్సహించి సబ్సిడీ అందిస్తున్నామని ఇందులో భాగంగా గత ఏడాది జిల్లాలో 6 వేల 130 ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగు కాగా, వానాకాలంలో ఇప్పటివరకు 21 వేల 726 ఎకరాల్లో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడం జరిగిందని మంత్రి వివరించారు. చొప్పదండిలో 37 కోట్ల రూపాయలతో వంద పడకల ప్రాంతీయ వైద్యశాల నిర్మించి ప్రారంభోత్సవానికి సిద్ధం చేశామని మానకొండూరులో 17.5 కోట్ల రూపాయలతో 30 పడకల సామాజిక వైద్యశాల భవనం నిర్మాణ దశలో ఉందని మంత్రి తెలిపారు. 15 కోట్ల రూపాయలతో కొత్తపల్లిలో ఆయుష్ ఆసుపత్రి నూతన భవనం నిర్మించనున్నామని కొత్తపల్లి మెడికల్ కళాశాల ఆవరణలో రూ.26 కోట్లతో మూడెకరాల్లో నర్సింగ్ కళాశాల భవనం నిర్మాణం పూర్తి కావస్తున్నదని జిల్లా యంత్రాంగం సమన్వయంతో 2 కోట్ల 98 లక్షల సీ.ఎస్.ఆర్ నిధులతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో అంబులెన్స్, వివిధ మిషన్లు ఏర్పాటు చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి 55 లక్షల రూపాయలను డి.ఎం.టి.ఎఫ్ నిధుల నుండి మంజూరు చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. మైనారిటీ సంక్షేమ గురుకుల పాఠశాలలు, హాస్టళ్లలో 3 వేల 822 మంది విద్యను అభ్యసిస్తున్నారని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా 2 వేల 214 మంది విద్యార్థులకు అన్ని సదుపాయాలతో వసతి కల్పిస్తున్నామని ఇటీవల నోటిఫికేషన్ వెలువడిన పోలీస్ ఉద్యోగాలకు వివిధ స్టడీ సర్కిళ్లలో శిక్షణ ఇస్తున్నమని మంత్రి తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ ద్వారా ఈ విద్యా సంవత్సరంలో 9 వేల 652 మంది విద్యార్థులకు 13 కోట్ల 82 లక్షల రూపాయల ఫీజు రియంబర్స్ మెంట్, ఉపకార వేతనాలు అందజేశామ జిల్లాలో 777 అంగన్వాడి కేంద్రాల ద్వారా 7 వేల 677 మంది గర్భిణీలు, బాలింతలకు, 40 వేల 135 మంది 7 నెలల నుండి 6 సంవత్సరాల లోపు పిల్లలకు బలవర్ధక, పోషక ఆహారం అందిస్తున్నామని మంత్రి వివరించారు. జిల్లాలో 60 అంగన్వాడీ టీచర్ల పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతున్నదని మంత్రి తెలిపారు. కరీంనగర్ లోని ప్రభుత్వ వయోవృద్ధులు, దివ్యాంగుల వసతిగృహంలో సిఎస్ఆర్ నిధులతో భవన మరమ్మతులు, సౌకర్యాలు కల్పిస్తున్నామని దివ్యాంగులకు ఈ ఏడాది 132 సహాయ ఉపకరణాలు పంపిణి చేశామని జిల్లాలో ట్రాన్స్ జెండర్ల సంక్షేమం కోసం మైత్రి క్లినిక్ సేవలు అందిస్తోందని మంత్రి తెలిపారు. రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో ముందుకు తీసుకువెళ్తున్న గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఏ. రేవంత్ రెడ్డి గారికి, జిల్లా సర్వతోముఖాభివృద్ధికి నిర్మాణాత్మక సహకారం, సూచనలు అందిస్తున్న గౌరవ పార్లమెంటు సభ్యులకు, గౌరవ శాసన మండలి సభ్యులకు, గౌరవ శాసన సభ్యులకు, గౌరవ స్థానిక ప్రజా ప్రతినిధులకు, జిల్లా ఉన్నతాధికారులకు, పోలీస్ సిబ్బందికి, న్యాయాధికారులకు, ఉద్యోగులకు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులకు, స్వాతంత్ర్య సమరయోధులకు, జర్నలిస్టులకు, జిల్లా ప్రజలకు, ప్రతి ఒక్కరికి పేరు పేరునా ఈసందర్భంగా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

# అన్ని రంగాల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధికి కృషి: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

### విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత






**కొత్తగూడెం సెప్టెంబర్ 17 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐడిఓసీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ మరియు చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లాకు విచ్చేసిన మంత్రికి జిల్లా కలెక్టర్ అంకిత్ పూల మొక్కను అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రజా పాలన దినోత్సవ సందేశాన్ని అందించారు. అనంతరం పత్రికా సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సెప్టెంబర్ 17వ తేదీ తెలంగాణ చరిత్రలో ఎంతో ప్రాధాన్యత కలిగిన రోజన్నారు. హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లో విలీనమైన చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. పేద ప్రజల సంక్షేమం, విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. యువతకు నాణ్యమైన విద్య, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేలా విద్యా సంస్థలు, మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా సాగునీరు, విద్యుత్, మార్కెటింగ్, రవాణా సౌకర్యాలను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు విస్తృతమైన సహజ వనరులు, అటవీ సంపద, గిరిజన సంస్కృతి, బొగ్గు నిక్షేపాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. జిల్లాలో మెడికల్ కాలేజీ, ఇంజనీరింగ్ కాలేజీతో పాటు ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఏర్పాటుతో విద్యా, వైద్య రంగాల్లో మరిన్ని అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి రహదారి, రైల్వే కనెక్టివిటీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు . భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. రహదారి, రైల్వే రవాణాతో పాటు గోదావరి నదీ మార్గం ద్వారా రవాణా అవకాశాలను అభివృద్ధి చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను విద్య, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమలు, రవాణా, పర్యాటకం, మౌలిక వసతులు తదితర అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎం. విద్యాచందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి,జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## ఓదెలలోఘనంగా ప్రజాపాలన దినోత్సవం

**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** పెద్దపల్లి జిల్లా ఓదెల మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో అనిల్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా పాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతం ఆలపించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాం పాలన నుండి తెలంగాణ విముక్తి కోసం పోరాడిన అమరవీరులను స్మరించుకున్నారు అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు అలాగే తాసిల్దార్ కార్యాలయ ఆవరణలో తాసిల్దార్ వనజ నాయక్ జాతీయ జెండా ఆవిష్కరించారు . మండలంలోని ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజా పాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ దుర్గేష్, జూనియర్ అసిస్టెంట్ దివ్య, శివ ఏపీవో మమత, రెవెన్యూ ఇన్స్పెక్టర్ గౌతమ్, మండల విద్యాధికారి రమేష్, ఏపీఎం, జూనియర్ అసిస్టెంట్ సాయి, జిపిఓ కిషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, కృష్ణవేణి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**పోరు తెలంగాణ, మంచిర్యాల,సెప్టెంబర్ 17, 2026:** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని మందమర్రి మండలం రామకృష్ణాపూర్ ప్రాంతంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, సింగరేణి డిస్పెన్సరీని మండల తహసిల్దార్ సతీష్, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, సింగరేణి సంస్థ మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ లతో కలిసి సందర్శించి ఆసుపత్రిలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, రోగులకు కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం నూతన ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటుకు అనువైన స్థలం కోసం సింగరేణి సంస్థకు చెందిన స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ కార్యాలయంలో విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం

### జిల్లా అధ్యక్షులు కట్ట రాజా నందం



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవము పెద్దపెల్లి జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమమునకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పెద్దపెల్లి ఎమ్మెల్యే సిహెచ్ విజయ రమణారావు అధికారులు ఇతర నాయకులు మన కుల బంధువులు దాదాపు 800 మంది సమక్షంలో జిల్లా అధ్యక్షులు కట్టా రాజా నందము నేతృత్వంలో పై అధికారులందరూ ఘనంగా స్వామివారికి పూలమాలలు వేసి ఘనంగా పూజలు చేశారు మన సీఐ బంధువు ప్రవీణ్ కుమార్, సిపి కార్యక్రమంలో పాల్గొన్నారు స్వీట్లు పంపిణీ చేశారు.పంచినారు కట్టరాజనందం శ్రీ విశ్వకర్మ భగవానుడు గురించి మాట్లాడుతూ విశ్వకర్మ భగవానుడు ఈ లోకములో స్వయంభుగా వెలసిన దేవుడు ఏమి లేని ఈ సృష్టిలో సకల చెరచెర్లను పంచభూతాలను సృష్టించాడు ఈ సృష్టికి మొదటి ఇంజనీరు మొదటి వాస్తు శిల్పి విశ్వకర్మ భగవానుడు దేవతలకు ఆయుధాలు సమకూర్చిన ఆదిదేవుడు విశ్వకర్మ శివునికి త్రిశూలం విష్ణువుకు సుదర్శన చక్రము ప్రసాదించిన దేవదేవుడు శ్రీకృష్ణునికి ద్వారక పాండవులకు ఇంద్రప్రస్థాన్ని నిర్మించిన వారు మన విశ్వకర్మ ఇంతటి దేవదేవుడే ఆ పరబ్రహ్మమే ప్రజాపతి విశ్వకర్మ అని కృష్ణ యజుర్వేదంలో చెప్పబడినది కార్యక్రమమునకు జిల్లాలోని వివిధ మండలాల నుండి పట్టణము నుండి విశ్వబ్రాహ్మణ కుల బంధువులు హాజరైనారు కోశాధికారి నాగవెల్లి శ్రీమన్నారాయణ, మడుపు అంజయ్య, ఉపాధ్యక్షులు చింతల సత్యనారాయణ మహిళా అధ్యక్షురాలు శ్రీరాములు రేణుక మహిళా ప్రధాన కార్యదర్శి వర్గాపురం సుప్రజ పట్టణ అధ్యక్షులు గొల్లపల్లి రమేష్ కార్పెంటర్ అధ్యక్షులు మియాపురం రమేష్ రాష్ట్ర కార్యదర్శి మునిగంటి కృష్ణ కందుకూరి ప్రభాకర్ ,అలువోదు నరసింహ చారి సిలుమోజు వీరాచారి గుగ్గిళ్ళ రవీంద్ర చారి కొక్కొండ రమేష్ రంగు రాము కోటగిరి అనిల్ తాటికొండ అనిల్ కట్టా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద కంజర్ల లో వినాయక నిమర్జనం చేస్తూ విషాదం

### ఆరుగురు విద్యార్థుల మృతిపై మాద్రి పృథ్వీరాజ్ తీవ్ర దిగ్భ్రాంతి.



**పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి యువకిశోర్ పటాన్చెరు నియోజకవర్గం సెప్టెంబర్ 17 :** పటాన్‌చెరు నియోజకవర్గం పెద్దకంజర్లలోని నేరేడు చెరువులో గణేష్ నిమజ్జనం సందర్భంగా జరిగిన విషాద ఘటనలో శిరీష చారిటబుల్ ట్రస్ట్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు మృతి చెందడం తీవ్ర విషాదాన్ని కలిగించింది. ఈ విషాద వార్త తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు, ఎండీఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ ఆసుపత్రికి వెళ్లి మృత విద్యార్థులకు నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ ఘటనపై మాద్రి పృథ్వీరాజ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, మృతుల కుటుంబ సభ్యులకు ఈ అపార దుఃఖాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని,మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు .

## లక్ష్మీదేవిపల్లి (S) గ్రామ పంచాయతీలో 'స్వచ్ఛతా హీ సేవా-2026' అవగాహన సదస్సు

### డిపిఓ అనూష



**కొత్తగూడెం సెప్టెంబర్ 17 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** స్వచ్ఛతా హీ సేవా-2026 కార్యక్రమంలో భాగంగా 1వ రోజు షెడ్యూల్‌లో భాగంగా పాల్వంచ మండలం లక్ష్మీదేవిపల్లి(రా) గ్రామ పంచాయతీ పరిధిలోని గురుకుల పాఠశాలలో జిల్లా పంచాయతీ అధికారి బి. అనూష పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు 2026లో సూచించిన లిలినాలుగు రకాల వ్యర్థాల వేరు వేరు సేకరణ లిలిపై అవగాహన కల్పించారు. వ్యర్థాలను మూలస్థాయిలోనే సక్రమంగా వేరు చేయడం, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం మరియు పర్యావరణ పరిరక్షణ, సుస్థిరత ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు తమ ఇళ్లలో, పాఠశాలలో మరియు పరిసరాల్లో పరిశుభ్రతను పాటిస్తూ, వ్యర్థాలను వేరు చేసి నిర్వహించేలా చైతన్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీదేవిపల్లి(రా) గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులు, పాల్వంచ ఎంపీ ఓ పంచాయతీ కార్యదర్శి, గురుకుల పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగాప్రజా పాలనా దినోత్సవం



**భద్రాద్రి కొత్తగూడెం,(పోరు తెలంగాణ- పినపాక నియోజకవర్గ ప్రతినిధి- వల్లెపోగు రాము) :** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని అశ్వాపురం ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగాఎంపీడీఓ ముత్యాలరావు జాతీయ జెండాను ఆవిష్కరించి, వందనం సమర్పించారు.

# సమాజ నిర్మాణంలో విశ్వకర్మల పాత్ర ఎంతో విశిష్టమైనది

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**పోరు తెలంగాణ మంచిర్యాల,సెప్టెంబర్ 17, 2026 :** సమాజ నిర్మాణంలో విశ్వకర్మల పాత్ర ఎంతో విశిష్టమైనదని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం విశ్వకర్మ జయంతిని పురస్కరించుకొని జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్లు పి. చంద్రయ్య, వి. రాములు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి లతో కలిసి హాజరై విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారతీయ పురాణాలు, ఇతిహాసాలు, సంప్రదాయాలలో విశ్వకర్మను దైవ శిల్పిగా, నిర్మాణకర్తగా గౌరవిస్తారని తెలిపారు. అనేక దివ్య నిర్మాణాలు, ఆయుధాలు, నగరాలు, శిల్పాలను రూపొందించినవారిగా పురాణాలలో విశ్వకర్మ ప్రస్తావన ఉందని, భారతీయ శిల్పకళ, వాస్తుకళ, నిర్మాణ నైపుణ్యాల సంప్రదాయానికి ప్రతీకగా భావిస్తారని తెలిపారు. విశ్వకర్మ సమాజానికి చెందిన వృత్తిదారులు వడ్రంగి, కమ్మరి, స్వర్ణకారులు, కంచరి, శిల్పకళ తదితర సంప్రదాయ వృత్తులను కొనసాగిస్తూ సమాజానికి అవసరమైన వస్తువులు, పనిముట్లు, నిర్మాణాలు, కళాఖండాలను రూపొందిస్తూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. నిర్మాణ రంగంతో పాటు వివిధ వృత్తులు, కళలు కాలానుగుణంగా ఎంతో అభివృద్ధి చెందాయని, నేటి తరం మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా కొత్త నైపుణ్యాలను నేర్చుకోవాలని తెలిపారు. సంప్రదాయ కళలు, వృత్తులను పరిరక్షించడంతో పాటు కొత్త కళలు, నైపుణ్యాలను నేర్చుకోవడం ద్వారా యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు, పారిశ్రామిక శిక్షణ సంస్థలు వంటి సాంకేతిక, వృత్తి విద్యా సంస్థల ద్వారా అందిస్తున్న శిక్షణా అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. డి.సి.పి. మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో వివిధ వృత్తుల వారి సేవలు ఎంతో విలువైనవని తెలిపారు. సంప్రదాయ వృత్తులను కొనసాగిస్తూ సమాజానికి సేవలందిస్తున్న విశ్వకర్మ వృత్తిదారుల పాత్ర అభినందనీయమని తెలిపారు. అనంతరం ఈ నెల 17 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు చేపట్టిన స్వచ్ఛత హి సేవ కార్యక్రమం సంబంధిత గోడ ప్రతులను జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్ లతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, విశ్వకర్మ సంఘాల ప్రతినిధులు, వృత్తిదారులు తదితరులు పాల్గొన్నారు.

# మహేశ్వరం మండలాన్ని పూర్తిగా ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలి

ఫ్యూచర్ సిటీని అడ్డుకుంటే చరిత్ర హీనులుగా మిగులుతారు..

ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ వత్తుల రఘుపతి..




**మహేశ్వరం, సెప్టెంబర్ 17, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** ఫ్యూచర్ సిటీలో మహేశ్వరం మండలాన్ని పూర్తిగా విలీనం చేసే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ వత్తుల రఘుపతి డిమాండ్ చేశారు. ఫ్యూచర్ సిటీని అడ్డుకుంటున్నవారు చరిత్ర హీనులుగా మిగిలిపోతారని అన్నారు. గురువారం మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలని కోరుతూ మహేశ్వరం బీరప్ప దేవాలయం నుండి ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ కార్యాలయం వరకు భారీ ర్యాలీని నిర్వహించి కమిషనర్ శశాంకకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ వత్తుల రఘుపతి మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్షల మేరకు మహేశ్వరం పూర్తి మండలాన్ని ఫ్యూచర్ సిటీలోకి తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు. ఫ్యూచర్ సిటీలోకి మహేశ్వరం మండలాన్ని తీసుకురావడం ద్వారా అభివృద్ధి కార్యక్రమాలతో పాటు మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు, విద్య, వైద్యం, రవాణా సౌకర్యం మహేశ్వరం ప్రాంతం అని రంగాలలో అభివృద్ధి చెందడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రాంతం యువతకు ఉపాధితో పాటు రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తో పాటు కొంతమంది బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఫ్యూచర్ సిటీ లోకి తీసుకోకుండా అడ్డుతగులుతున్నారని ఆయన మండి పడ్డారు. ఇటీవల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తుక్కుగూడలో మాట్లాడుతూ సర్పంచుల తీర్మానాలు లేకుండా అన్ని గ్రామాలను ఫ్యూచర్ సిటీలో విలీనానికి కృషి చేస్తాననడంతో మహేశ్వరం మండలంలోని కాంగ్రెస్ నేతలు ఉత్సాహంతో పాల్గొని కమిషనర్ కు వినతిపత్రాన్ని అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ గౌరవాధ్యక్షుడు కర్నాటి మనోహర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వట్టెల మల్లేష్ యాదవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, శివగంగ దేవాలయం చైర్మన్ అల్లె కుమార్ సర్పంచులు జగన్మోహన్ రెడ్డి, దేవేందర్ నాయక్, రాజుగొల్లూరి, చేపంగి ప్రవీణ్, నేనావత్ రాజు నాయక్, మాదర మోని మల్లేష్, గోపాల్ నాయక్ నాయకులు పి. రాఘవేందర్ రెడ్డి, వర్కల యాదగిరి గౌడ్, కూన యాదయ్య, కృష్ణా నాయక్, విఠల్ నాయక్, ఆవుల యాదయ్య, ఆమనగంటి ప్రశాంత్ రెడ్డి, నందిగామ నరసింహ, మంత్రి బాల్ రాజ్, ఆవుల రఘుపతి, నడికుడి శివ, ఇంద్రకంటి నరసింహ గౌడ్, పోతర్ల సాంబయ్య యాదవ్, ఇంద్రకంటి వెంకటేష్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ బురమోని నరసింహ యాదవ్, యూత్ అధ్యక్షుడు ఆకాష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జగిత్యాల జిల్లా, కోరుట్ల యూట్యూబర్ వైష్ణవి భర్త హరి దారుణహత్య..!




**పోరు తెలంగాణ ప్రతీనిది// మెట్ పల్లి :** జగిత్యాల జిల్లా, కోరుట్లకు చెందిన యూట్యూబర్ వైష్ణవి భర్త చిత్తరి హరిబాబు (26) గురువారం నిజామాబాద్ రాజా రాజేంద్ర చౌరస్తా వద్ద దారుణ హత్యకు గురైనట్లు సమాచారం. కారులో వచ్చిన పలువురు వ్యక్తులు హరిబాబుపై కొబ్బరి బొండాలు కొట్టే కత్తులతో విచక్షణారహితంగా దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. తీవ్ర గాయాలతో హరిబాబు అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం.హత్య అనంతరం నిందితులు కారులో అక్కడి నుంచి పరారైనట్లు సీసీ ఫుటేజ్ ద్వారా తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. నిజామాబాద్‌లో కత్తులతో దాడి కారులో వచ్చిన దుండగుల పరారీ

**వైష్ణవి హత్య కేసులో నిందితుడిగా హరిబాబు**

జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన వైష్ణవి (19), కోరుట్ల పట్టణంలోని ఏసుకొనిగుట్టకు చెందిన హరిబాబును వివాహం చేసుకుంది. నాలుగు నెలల గర్భిణిగా ఉన్న వైష్ణవి హత్యకు గురైన ఘటనలో హరిబాబుపై ఆరోపణలు ఉన్నాయి. వైష్ణవి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి హరిబాబును అరెస్టు చేశారు. ఇటీవలే హరిబాబు బెయిల్‌పై జైలు నుంచి బయటకు వచ్చినట్లు సమాచారం. ఇటీవల బెయిల్‌పై విడుదలైన కొద్దికాలానికే హరిబాబు హత్యకు గురికావడంతో ఈ ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత కక్షలారణంగానే హత్య జరిగిందా? అనే కోణంలోనూ ముగ్గురు నిందితులు ఎవరు.. వారు ఏ జిల్లాకు చెందినవారు? అనే కోణాల్లో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు పోలీసులు ఘటనా స్థలాన్ని ఏసీపీ ప్రకాశ్ యాదవ్, టూటౌన్ ఎస్ఐ యాదగిరి గౌడ్ పరిశీలించి, మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి మత సామరస్యానికి ప్రతీకగా నిలవాలి

సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మవద్దు... డీజేలకు అనుమతులు లేవు: పోలీస్ కమిషనర్ శ్రీ అంబర్ కిశోర్ ఝా,





**పోరు తెలంగాణ,పెద్దపల్లి, సెప్టెంబర్ 17 :** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో గణపతి నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన శోభాయాత్రను ప్రశాంత వాతావరణంలో, మత సామరస్యం, సోదరభావంతో నిర్వహించేందుకు పోలీస్ శాఖ ముందస్తు చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా గురువారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో పెద్దపల్లి, మంచిర్యాల జోన్ల పరిధిలోని అన్ని వర్గాల మతపెద్దలు, గణపతి ఉత్సవ కమిటీ సభ్యులతో పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆధ్వర్యంలో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా అన్ని మతాల పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులతో శాంతి సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమాజంలో శాంతి, సోదరభావం, పరస్పర గౌరవం కొనసాగేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. మతపెద్దలు, సమాజంలోని పెద్దలు తమ పరిధిలోని ప్రజలకు, ముఖ్యంగా యువతకు శాంతి, సంయమనం, పరస్పర గౌరవం పాటించేలా అవగాహన కల్పించాలని కోరారు.ఎక్కడైనా చిన్నపాటి సంఘటన లేదా వివాదం జరిగినప్పుడు ఆవేశానికి లోనై ఎక్కువ మందిని సమీకరించకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సమస్యలను ఎవరూ స్వయంగా పరిష్కరించేందుకు ప్రయత్నించకూడదన్నారు. వినాయక విగ్రహాల ఏర్పాటు ప్రాంతాల్లో ఏవైనా సమస్యలు తలెత్తినా, నిమజ్జన శోభాయాత్రకు సంబంధించి ట్రాఫిక్, రహదారులు, నిమజ్జన సమయం, విగ్రహాల సంఖ్య తదితర అంశాల్లో ఏవైనా ఇబ్బందులు ఉన్నా ముందుగానే పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. పరిస్థితులను పరిశీలించి అవసరమైన సమన్వయం, భద్రతా ఏర్పాట్లపై పోలీస్ శాఖ తగిన సూచనలు,చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా అన్ని మతాల విశ్వాసాలు, ప్రార్థనా స్థలాలు, ప్రజల మనోభావాలను గౌరవిస్తూ సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా శోభాయాత్ర మసీదులు,ఇతర ప్రార్థనా స్థలాలు లేదా ముస్లిం జనాభా అధికంగా ఉన్న ప్రాంతాల మీదుగా వెళ్లే సమయంలో స్థానిక మతపెద్దలు,ఉత్సవ కమిటీ సభ్యులు ముందుగానే సమన్వయం చేసుకోవాలని తెలిపారు.నమాజ్ సమయాలు, శోభాయాత్ర మార్గాలకు సంబంధించి ఏవైనా ప్రత్యేక అంశాలు ఉంటే ముందుగానే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఎవరైనా రెచ్చగొట్టే వ్యాఖ్యలు, నినాదాలు చేసినా లేదా సోషల్ మీడియాలో వివాదాస్పద, అసత్య సమాచారాన్ని ప్రచారం చేసినా వెంటనే స్పందించకుండా పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఆవేశపూరిత ప్రతిస్పందనల వల్ల చిన్న సమస్య పెద్ద వివాదంగా మారే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జన శోభాయాత్ర ప్రశాంతంగా నిర్వహించడం పోలీస్ శాఖ ఒక్కదాని బాధ్యత కాదని, అన్ని మతాల పెద్దలు, ఉత్సవ కమిటీలు, ప్రజలు పరస్పర సమన్వయంతో, బాధ్యతాయుతంగా వ్యవహరించినప్పుడే మత సామరస్యం, శాంతి, సోదరభావం కొనసాగుతాయని పోలీస్ కమిషనర్ తెలిపారు. డీజేలకు అనుమతులు లేవని, నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఉత్సవాలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అన్ని వర్గాల ప్రజలు పోలీస్ శాఖకు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె.శ్రీనివాస్,స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్,స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు భీమేష్, శ్రీనివాస్, బెల్లంపల్లి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రావు, ఎస్ఐలు మనోహర్, రాజేందర్, చంద్రశేఖర్, సంధ్యారాణి,శ్రీలత, మతపెద్దలు,ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# జిల్లాలో జ్ఞాన భారతం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య




**పోరు తెలంగాణ మంచిర్యాల సెప్టెంబర్ 17, 2026 :** జిల్లాలో జ్ఞాన భారతం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్ లో జ్ఞాన భారతం సంబంధిత జిల్లాస్థాయి కో-ఆర్డినేషన్ కమిటీ అధికారులు, విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జ్ఞాన భారతం కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పురాతన గ్రంథాలు, తాళపత్ర గ్రంథాలు, అరుదైన మాన్యుస్క్రిప్ట్‌లను గుర్తించి భద్రపరచే ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని, జిల్లాలోని వివిధ ప్రాంతాలలో, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రంథాలయాలు, విద్యా సంస్థలు, దేవాలయాలు, మఠాలు, పరిశోధనా సంస్థలు, వ్యక్తుల వద్ద అందుబాటులో ఉన్న పురాతన గ్రంథాలు, తాళపత్ర గ్రంథాలు, చారిత్రక ప్రాధాన్యత కలిగిన మాన్యుస్క్రిప్ట్‌లను సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో గుర్తించి భద్రపరిచే కార్యక్రమం చేపట్టాలని తెలిపారు. ప్రజల వద్ద ఉన్న అరుదైన గ్రంథాలు, పాత పత్రాలు, తాళపత్ర గ్రంథాల సమాచారాన్ని అధికారులకు అందించాలని తెలిపారు. మన సంస్కృతి, సాంప్రదాయాలు, నాగరికత సంబంధిత గ్రంథాలు, ఇన్స్క్రిప్షన్స్ , శిలా శాసనాలు సంబంధిత పత్రాలు ఎవరి దగ్గరైనా ఉన్నట్లయితే జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు), జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం నందు సమర్పించాలని తెలిపారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో సంబంధిత కళాశాలల విద్యార్థులకు జ్ఞాన భారతం కార్యక్రమం సంబంధించి అవగాహన కల్పించి, జిల్లాలోని మారుమూల ప్రాంతాల సంబంధిత గ్రంథాలు ఏమైనా ఉన్నట్లయితే వారి ద్వారా సేకరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని పురాతన దేవాలయాలు, మసీదులు, చర్చిలలో అందుబాటులో ఉన్న ప్రాచీన గ్రంథాలను కుల, మత, వర్గ భేదాలకతీతంగా సమాచారాన్ని అందించాలని, సంబంధిత పత్రాలను డిజిటలైజేషన్ చేసి భద్రపరచడం జరుగుతుందని, తద్వారా జిల్లా చరిత్ర, సంస్కృతి, సాహిత్యం, సంప్రదాయాలు, స్థానిక వారసత్వానికి సంబంధించిన విలువైన సమాచారాన్ని భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉంచడమే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా భారతదేశ గొప్పతనాన్ని చాటేందుకు జ్ఞాన భారతి కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. గుర్తించిన మాన్యుస్క్రిప్ట్‌లను శాస్త్రీయ పద్ధతులలో డిజిటలైజేషన్ చేసి, వాటి సమాచారాన్ని రక్షించడం జరుగుతుందని, ప్రభుత్వం నిర్దేశించిన విధంగా కేంద్రీకృత ప్రదేశంలో భద్రపరిచి, కేంద్రీకృత డిజిటల్ డేటాబేస్‌లో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జ్ఞాన భారతం జిల్లా స్థాయి కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులు, జిల్లా పౌర సంబంధాల అధికారి యం.కృష్ణమూర్తి, జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ అధికారి, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి అంజయ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత బలోపేతం చేయాలి: జిల్లా కలెక్టర్ అంకిత్

ఈసిఐఎల్ సంస్థ సిఎస్ఆర్ ద్వారా రూ.67.41 లక్షల విలువైన వైద్య పరికరాల అందజేత



**కొత్తగూడెం సెప్టెంబర్ 17 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, కొత్తగూడెంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా వైద్య మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ , హైదరాబాద్ సంస్థ తన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధుల ద్వారా రూ.67.41 లక్షల విలువైన ఆధునిక వైద్య, ఆసుపత్రి పరిశుభ్రత పరికరాలను ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి అందజేసింది. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్ సమక్షంలో ఈసిఐఎల్ అధికారులు ఈ పరికరాలను ఆసుపత్రి అధికారులకు అందజేశారు. సిఎస్ఆర్ నిధుల ద్వారా అందజేసిన పరికరాల్లో ఐసీయూ సేవల కోసం 3-ఫంక్షన్ రిమోట్ ఆపరేటెడ్ ఫౌలర్ కాట్స్, నేత్ర వైద్య సేవల కోసం ఆప్తాల్మిక్ ఆపరేటింగ్ మైక్రోస్కోప్, ఫుట్ అడ్జస్ట్మెంట్ సదుపాయంతో కూడిన ఆప్తాల్మిక్ ఎలక్ట్రిక్ ఆపరేషన్ టేబుల్, ఆర్థోపెడిక్ డ్రిల్ యూనిట్ విత్ యాక్సెసరీస్, వాక్యూమ్ అసిస్టెడ్ క్లోజర్ మెషిన్ ఉన్నాయి. అదేవిధంగా ఆసుపత్రి పరిశుభ్రతను మెరుగుపరిచేందుకు స్క్రబ్బింగ్ మెషిన్, కాంపాక్ట్ వాక్-బిహైండ్ స్వీపర్, హై-ప్రెజర్ వాషర్ వంటి పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ , సిఎస్ ఆర్ సంస్థల సహకారంతో ప్రభుత్వ ఆసుపత్రులకు అందుతున్న వైద్య పరికరాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అందుబాటులోకి వచ్చిన ఆధునిక పరికరాలతో ఐసీయూ, నేత్ర, ఆర్థోపెడిక్ తదితర వైద్య సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. రోగులకు సకాలంలో అవసరమైన వైద్యం అందేలా వైద్యులు, నర్సింగ్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ అంకిత్ ఆసుపత్రి క్యాజువాలిటీ విభాగాన్ని సందర్శించి అక్కడి వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యం కోసం వేచి ఉన్న ఓ రోగిని గమనించిన కలెక్టర్, ఎందుకు వేచి ఉన్నారు, సమస్య ఏమిటని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఓపీ సమయం ముగిసిన అనంతరం ఆసుపత్రికి వచ్చినందున వేచి ఉన్నట్లు రోగి తెలిపాడు. వెంటనే స్పందించిన కలెక్టర్, ఎలాంటి జాప్యం లేకుండా అవసరమైన అత్యవసర వైద్య సేవలు అందించాలని సంబంధిత వైద్య సిబ్బందిని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వచ్చే రోగులకు తక్షణ వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని, వైద్య సేవల్లో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. అదేవిధంగా ఆసుపత్రి పరిశుభ్రతకు అందజేసిన పరికరాలను సమర్థవంతంగా వినియోగించాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రి ప్రాంగణం, వార్డులు, వైద్య విభాగాలు పరిశుభ్రంగా ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని, రోగులకు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో ఈసిఐల్ సంస్థ తరపున డైరెక్టర్ (పర్సనల్) కన్నెన్ వి.ఎ.ఎస్., సీఎంఓ డ ఇన్‌చార్జి డా. పి. వేణుబాబు, డిప్యూటీ మేనేజర్ సునీల్ కుమార్ జె., డిప్యూటీ మేనేజర్ (సివిల్) అనిల్ కుమార్ అధ్యక్షులు పూర్ణచందర్ పి. ఫోటోగ్రఫీ అధికారి సాంబమూర్తి పాల్గొన్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా. రాధామోహన్, సిపిఓశ సునీత, ఆసుపత్రి సీనియర్ అధికారులు, వైద్యులు, నర్సింగ్ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.ఓదెల లో విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం

# ఓదెల లో విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 17న ఓదెల మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సీతారామాలయంలో నాగవెల్లి సందీప్ చార్యులు ప్రత్యేక పూజలతో విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం ఘనంగా నిర్వహించారు . దైవిక వాస్తుశిల్పి అయిన భగవాన్ విశ్వకర్మ గౌరవార్థం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు.

**విశ్వకర్మ జయంతి విశిష్టత , ప్రాముఖ్యత**

సృష్టికర్తగా పూజ: హిందూ పురాణాల ప్రకారం విశ్వకర్మను సకల కళలకు ఆదిదేవునిగా, ప్రపంచ సృష్టికర్తగా భావిస్తారు. పనిముట్ల పూజ: ఇంజనీర్లు, ఆర్కిటెక్టు, మెకానిక్లు, ఫ్యాక్టరీ కార్మికులు, చేతివృత్తుల వారు తమ పనిముట్లు, యంత్రాలను శుభ్రం చేసి ప్రత్యేకంగా పూజిస్తారు. కార్యక్రమానంతరం బ్రాహ్మండ్లపల్లి జయ భీమయ్య ఆధ్వర్యంలో అన్న ప్రసాదన కార్యక్రమం నిర్వహించినారు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు..

# తారానగర్‌లో ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

యజ్ఞ మహోత్సవం, అన్నప్రసాదం,ఘనంగా ఊరేగింపు

కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన బీసీ కులాల ఐక్య వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్.



**పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి శేరిలింగంపల్లి నియోజకవర్గ సెప్టెంబర్ 17 :** విశ్వకర్మ జయంతి సందర్భంగా శేరిలింగంపల్లి తారానగర్‌లోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం వద్ద విశ్వకర్మ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా యజ్ఞ మహోత్సవం నిర్వహించారు. బి.ఆర్. గ్యాస్ సమీపంలోని ఆలయ ప్రాంగణంలో ఉదయం 10:30 గంటలకు స్వర్ణకారులచే ప్రత్యేక యజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులు, సంఘం సభ్యులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. సాయంత్రం 5.00 గంటల నుంచి విశ్వకర్మ జయంతి సందర్భంగా ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వకర్మ భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆయన సేవలు, విశ్వ నిర్మాణంలో ఆయనకు సంబంధించిన సంప్రదాయ విశ్వాసాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలకు, స్వర్ణకార సంఘం సభ్యులకు విశ్వకర్మ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. తారానగర్ విశ్వకర్మ స్వర్ణకార సంఘం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తులు, సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా బీసీ కులాల ఐక్య వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచంద్ర యాదవ్, కృష్ణ, గోవింద రావు చారి, రవీందర్ చారి, శేరిలింగంపల్లి స్వర్ణకార సంఘం అధ్యక్షులు ఎం. ప్రభాకర్ చారి, స్వర్ణకార సంఘం ఉపాధ్యక్షులు ఎ.రఘు చారి, బీసీ కులాల ఐక్య వేదిక రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సిరిపురం హరి కృష్ణ చారి, రాయుడు, ఆర్టీసీ సురేష్ యాదవ్, అన్నదొర, మల్కయ్య, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బేరి రామచందర్ యాదవ్ మాట్లాడుతూ విశ్వకర్మ చూసిన సన్మార్గంలో నడవాలని అన్నారు. ప్రపంచానికి విశ్వకర్మ మార్గదర్శకులను సూచించారు. ఆయన చూపిన మార్గంలో నడవాలని గుర్తు చేశారు. విశ్వకర్మ జయంతి రెండుసార్లు జరుగుతుందా విశ్వకర్మ జయంతి పేరుతో వేర్వేరు ప్రాంతాలలో రెండు సందర్భాలలో వేడుకలు కనిపించడానికి ప్రధాన కారణం పంచాంగాలు, ప్రాంతీయ ఆచారాలలో ఉన్న తేడాలు. సాధారణంగా కన్యా సంక్రాంతి సందర్భంగా సెప్టెంబర్‌లో విశ్వకర్మ పూజ, జయంతిని నిర్వహించే సంప్రదాయం ఉంది. 2026లో ఇది సెప్టెంబర్ 17న వచ్చింది. అదే సమయంలో కొన్ని ప్రాంతాలు, వృత్తి సంఘాలు తమ స్థానిక సంప్రదాయాలు లేదా ప్రత్యేక పంచాంగ విధానాల ప్రకారం మరో తేదీన విశ్వకర్మ పూజను నిర్వహిస్తాయి. కాబట్టి రెండు తేదీలలో కార్యక్రమాలు కనిపించినంత మాత్రాన విశ్వకర్మ జయంతి రెండు వేర్వేరు జయంతులు అని అర్థం కాదు. స్థానిక పంచాంగం, ఆలయ లేదా సంఘం సంప్రదాయం ఆధారంగా తేదీ మారవచ్చు. ఈ కార్యక్రమంలో వినయ కుమార్ గౌడ్, ప్రభు చారి, గోవిందరావు, రఘు చారి, శ్రీధర్ చారి, పి.రవికాంత్ చారి, పి ఆంజనేయ చారి, యాదగిరి చారి, ఎన్.ప్రభాకర్, ఎన్. శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ప్రజా పాలన దినోత్సవం





**పోరు తెలంగాణ మంచిర్యాల సెప్టెంబర్ 17 :** రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కి అదనపు డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్ మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ కమిషనర్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, కమిషనరేట్ కార్యాలయ భవనం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. అధికారులు, సిబ్బందితో కలిసి జాతీయ గీతంతో పాటు రాష్ట్ర గీతం "జయ జయహే తెలంగాణ"ను ఆలపించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అధికారులు, సిబ్బందికి ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజలందరికీ ఎంతో ప్రాముఖ్యత కలిగిన చారిత్రక దినమని పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం తెలంగాణ ప్రాంతం ప్రజాపాలనలోకి వచ్చిన సెప్టెంబర్ 17వ తేదీకి చారిత్రక ప్రాధాన్యత ఉందన్నారు. ఇదే రోజున అప్పటి నిజాం పాలన నుంచి తెలంగాణ ప్రాంతం భారత యూనియన్‌లో విలీనమై, సమగ్ర భారతదేశంలో అంతర్భాగంగా మారిందన్నారు. ఈ చారిత్రక పరిణామం కోసం నాడు ఎన్నో త్యాగాలు, బలిదానాలు చేసిన వారందరినీ ఈ సందర్భంగా గౌరవంగా స్మరించుకోవాలని తెలిపారు. వారి త్యాగాలను ఎల్లప్పుడూ గుర్తు చేసుకుంటూ దేశ సమగ్రత, ఐక్యతను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ శాంతి, సౌభ్రాతృత్వం, అభివృద్ధి కోసం ఐక్యంగా పనిచేసేలా ప్రోత్సహించాలని సూచించారు. పోలీస్ శాఖ తరఫున ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, వారికి భద్రత, సౌకర్యాలు కల్పించడం, శాంతిభద్రతలను మరింత పటిష్టంగా పరిరక్షించడం తమ ప్రధాన బాధ్యత అని పోలీస్ కమిషనర్ తెలిపారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ వారి భద్రత, సంక్షేమం కోసం పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తోందన్నారు. సెప్టెంబర్ 17 సందర్భంగా ఈ స్ఫూర్తిని మరోసారి గుర్తుచేసుకుని, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషిని మరింత సమర్థవంతంగా కొనసాగించాలని తెలిపారు. రామగుండం కమిషనరేట్ పరిధిలోని ప్రజలకు ఉత్తమమైన పోలీస్ సేవలు అందిస్తూ, శాంతిభద్రతలను సమర్థవంతంగా పరిరక్షిస్తూ, రాష్ట్ర అభివృద్ధికి తమ వంతు సహకారం అందించేందుకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె.శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, సీసీఎస్ ఏసీపీలు రవీందర్, ప్రవీణ్ కుమార్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ రావు, ఏవో శ్రీనివాస్, ఆర్ఐలు మల్లేశం, దామోదర్, రమేష్, గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాద్ రావు, రామగుండం సీఐ కృష్ణ కుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు, వివిధ విభాగాల ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, సీపీఓ సిబ్బంది, వివిధ విభాగాల సిబ్బంది, ఏఆర్ సిబ్బంది, ప్రత్యేక బృందాల సిబ్బంది పాల్గొన్నారు.

## అంతర్ జిల్లా దొంగల ముఠా పై పోలీసుల ఉక్కుపాదం

దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా నలుగురు అరెస్టు....





**పోరు తెలంగాణ సెప్టెంబర్ 17: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖైర్‌గావ్ గ్రామంలో జరిగిన దొంగతనం కేసును జిల్లా పోలీసులు ఛేదించారు. జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆదేశాల మేరకు డీఎస్పీ బి. అశోక్, రెబ్బెన సీఐ ఎం. సంజయ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన మూడు ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేపట్టాయి. సెప్టెంబర్ 7న రెబ్బెన మండలం ఖైర్‌గావ్ గ్రామంలో ఇంటి యజమానులు బంధువు మృతి కారణంగా తాండూర్‌కు వెళ్లగా, ఇల్లు ఖాళీగా ఉన్న సమయంలో నిందితులు రెక్కీ నిర్వహించి తాళం పగులగొట్టి విలువైన వస్తువులు దొంగిలించారు. కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్ వద్ద వాహన తనిఖీల్లో భాగంగా పోలీసులు అనుమానాస్పద స్విఫ్ట్ డిజైర్ కారును తనిఖీ చేయగా, తాళాలు పగులగొట్టే సామాగ్రితో పాటు బంగారం, వెండి లభించాయి. కారులోని నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించగా తాండూర్, ఖైర్‌గావ్, జాకులపల్లి, రెబ్బెన ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడినట్లు తేలింది. అరెస్టయిన నిందితులు: తాండూర్ శివాజీ నగర్‌కు చెందిన ఊపట్ల ప్రణయ్ (30, తండ్రి తిరుపతి), తాండూర్ శంభాజీ నగర్‌కు చెందిన మంచెర్ల సతీష్ కుమార్ (29, తండ్రి పోచం), తాండూర్ శివాజీ నగర్‌కు చెందిన రాజేశం (32, తండ్రి మల్లయ్య), తాండూర్ శివాజీ నగర్‌కు చెందిన శాలిగామ కృష్ణ (32, తండ్రి నీలయ్య). నిందితుల నుండి 10.3 తులాల బంగారం, 30 తులాల వెండి, 4 మొబైల్ ఫోన్లు, నేరానికి ఉపయోగించిన స్విఫ్ట్ డిజైర్ కారు, తాళాలు పగులగొట్టే సామాగ్రి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించనున్నారు. ఈ కేసు ఛేదనలో డీఎస్పీ బి. అశోక్, రెబ్బెన సీఐ ఎం. సంజయ్, ఎస్ఐ వెంకట కృష్ణ, హెచ్‌సీ రవి కుమార్, పీసీ నౌషాద్, పీసీ వెంకటేష్ లను జిల్లా ఎస్పీ నితికాపంత్ అభినందించారు.

## చెన్నూర్ నరేంద్ర మోడీ 76వ జన్మదిన వేడుకలు





**పోరు తెలంగాణ, మంచిర్యాల, సెప్టెంబర్ 17 :** నరేంద్ర మోడీ 76వ జన్మదినాన్ని పురస్కరించుకొని భారతీయ జనతా పార్టీ పిలుపు మేరకు చెన్నూరు పట్టణం ప్రాచీన జగన్నాథ స్వామి దేవాలయంలో ఆశీస్సుల దీపం కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ దంపతులు ఆశీస్సుల దీపాలు వెలిగించి భగవంతుని నరేంద్ర మోడీ కి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని వేడుకొన్నారు ఈ కార్యక్రమంలో చెన్నూరు పట్టణ కౌన్సిలర్లు పట్టణ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వెయ్యి రోజుల ప్రజా పాలనలో హామీల అమలుపై వివరణ





**పోరు తెలంగాణ సెప్టెంబర్ 17: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ నియోజకవర్గంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజా పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. టిపిసిసి స్పోక్స్‌పర్సన్ ఏబీ శ్రీనివాస్, పి ఎ సి సభ్యుడు ఆదిలాబాద్ అశ్విన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. వెయ్యి రోజుల పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, ఎన్నికల హామీల అమలు, రైతులు, మహిళలు, యువత, పేదలు, ఉద్యోగాల రంగంలో చేపట్టిన చర్యలను నాయకులు వివరించారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్న వడ్లకు బోనస్, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఉద్యోగ నియామకాలు వంటి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి జిల్లా అధ్యక్షురాలు అత్రం సుగుణ, ఏఎంసీ చైర్మన్ మంగ, డిసిసి వైస్ ప్రెసిడెంట్ తారిక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వైరాగడ్ మారుతి పటేల్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సుద్దాల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు రాపర్తి మురళి, టౌన్ ప్రెసిడెంట్ ఇమ్రాన్, అసెంబ్లీ కోఆర్డినేటర్ సాయి, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడు, బాలు అబ్బో, పింటూ, కాంగ్రెస్ నాయకులు, మీడియా ప్రతినిధులు

## జిల్లా అదనపు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కాగజ్ నగర్ సబ్ కలెక్టర్



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 17: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో కాగజ్ నగర్ సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన హర్ష చౌదరి గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. కాగజ్ నగర్ డివిజన్‌లో భూ సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ సూచించారు. ప్రజలతో మమేకమై, నిబంధనలకు లోబడి సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ సేవలు అందించాలని పేర్కొన్నారు.

## ఓటరు ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, సవరణలు వెంటనే తెలియజేయాలి



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 17: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఓటరు ముసాయిదా జాబితాను ప్రదర్శించినట్లు ఎన్నికల అధికారి/ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఒక ప్రకటనలో తెలియజేసింది. జాబితాపై ఏవైనా అభ్యంతరాలు, సవరణలు, మార్పులు ఉంటే ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారి/ముఖ్య కార్యనిర్వహణ అధికారికి సమర్పించాలని సూచించింది. అభ్యంతరాలు, సవరణలను పరిశీలించిన అనంతరం సవరించిన ఓటరు జాబితాను 19వ తేదీన ప్రదర్శిస్తారు.

## పెరియార్ రామస్వామి జయంతి, భయ్యాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 17: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో భారతీయ బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో పెరియార్ రామస్వామి 147వ జయంతి, భయ్యాసాహెబ్ అంబేద్కర్‌గా పిలువబడే యశ్వంత్ భీమరావు అంబేద్కర్ 49వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్ మహుల్కర్, సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం సందీప్ మాట్లాడుతూ.. కుల వివక్ష, అసమానతలు, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పెరియార్ చేసిన పోరాటాలను, యశ్వంత్ అంబేద్కర్ సామాజిక, రాజకీయ, బౌద్ధ ఉద్యమ సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో దుర్గం దుర్గాజీ, దుర్గం శ్యామ్‌రావు, శ్యామ్‌రావు లహుజి దుర్గే, బౌద్ధ ఉపాసకులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కిష్టంపేట లో తెలంగాణ విమోచన దినోత్సవం





**పోరు తెలంగాణ మంచిర్యాల సెప్టెంబర్ 17 :** తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా చెన్నూరు మండలం, కిష్టంపేట గ్రామ బస్టాండ్ దగ్గర బిజెపి చెన్నూరు మండల అధ్యక్షులు బుర్ర రాజశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమానికి కిష్టంపేట గ్రామ సర్పంచ్ రావుల తిరుమల, తిరుపతి, పంచాయితీ కార్యదర్శి సిహెచ్ మధుకర్ కార్య, భారీ రాజిరెడ్డి మాజీ సర్పంచ్ బుర్ర రాకేష్ గౌడ్ మరియు వార్డ్ మెంబర్లు గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది

## అభిమాని ఇంటికి వెళ్లి పరామర్శించిన రేగా కాంతారావు

ప్రమాదంలో గాయపడిన రేగా వీరాభిమానిని ఆదుకుని వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం..



**భద్రాద్రి కొత్తగూడెం, (పోరు తెలంగాణ పెనుపాక నియోజకవర్గం ప్రతినిధి వల్లెపోగు రాము) అశ్వాపురం సెప్టెంబర్ 17:-** అభిమానం అంటే కేవలం నినాదాల్లో కాదు.. కష్టకాలంలో అండగా నిలబడటంలోనూ ఉంటుందని మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు చాటిచెప్పారు. అశ్వాపురం మండలం మల్లెలమడుగు గ్రామంలో ఇటీవల రేగా కాంతారావుకు స్వాగతం పలికే ర్యాలీలో బైక్ అదుపుతప్పి ప్రమాదానికి గురై గాయపడిన రేగా వీరాభిమాని కుక్కల రాంబాబును గురువారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. రాంబాబు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5,000 ఆర్థిక సహాయం అందించారు.

**ఈ సందర్భంగా రేగా కాంతారావు మాట్లాడుతూ..**

"అభిమాని కష్టాల్లో ఉన్నప్పుడు పక్కన నిలబడటం నా బాధ్యత. ఆపదలో అండగా ఉండటమే నిజమైన బంధం" అనే భావాన్ని చాటిచెప్పారు.

రేగా కాంతారావు స్వయంగా ఇంటికి వచ్చి పరామర్శించి ఆర్థిక సహాయం అందించడంతో రాంబాబు కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు.

అభిమానం అడుగులు కలిపిస్తుంది..
ఆపద వచ్చినప్పుడు అదే అభిమానం బంధంగా మారుతుంది.
కష్టంలో ఉన్న మనిషికి తోడుగా నిలిచే చేయి..
వేల మాటల కంటే విలువైనది.

## ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా జండా ఆవిష్కరణ చేసిన సీఐ సిహెచ్ ఎల్లయ్య



**భద్రాద్రి కొత్తగూడెం, (పోరు తెలంగాణ పినపాక నియోజవర్గ ప్రతినిధి వల్లెపోగు రాము) అశ్వాపురం సెప్టెంబర్17:-** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం అశ్వాపురం పోలీస్ స్టేషన్‌లో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐ సిహెచ్. ఎల్లయ్య జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారులి.

## కనగర్తిలో విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** పెద్దపల్లి జిల్లా ఓదెల మండల స్వర్ణకార సంఘం అధ్యక్షులు వెలుసోజు రవీంద్ర చారి ఆధ్వర్యంలో విశ్వకర్మ భగవాన్ యజ్ఞ మహోత్సవం కార్యక్రమం కనగర్తి గ్రామంలో అత్యంత వైభవంగా నిర్వహించినారు ఈ కార్యక్రమానికి ఓదెల మండలంలో ని అన్ని గ్రామాల స్వర్ణకార సంఘం సభ్యులు భారీగా వచ్చి ఆ భగవాను ని దర్శించుకోవడం జరిగింది. కార్యక్రమంలో శ్రీధర్, నరసింహ చారి, శ్రీనివాస్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## బాలికను వేధించిన వ్యక్తికి జైలు శిక్ష..



**మహేశ్వరం, సెప్టెంబర్ 17, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** మైనర్ బాలికను అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసిన సంఘటన మహేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. మహేశ్వరం సిఐ రాఘవేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 9న మహేశ్వరంలో మైనర్ బాలికను వేధించిన మహేశ్వరం గ్రామానికి చెందిన మంకాల దశరథను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. మహేశ్వరం గ్రామంలోని ఒక మెడికల్ షాప్ సమీపంలో మైనర్ బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన దశరథను బాలిక తల్లి ఫిర్యాదు మేరకు చట్ట ప్రకారం కోర్టు మందు ప్రవేశపెట్టి గురువారం రిమాండ్ కు తరలించినట్లు ఆయన తెలిపారు.

## ప్రభుత్వ వైద్యానికి మరో విజయగాథ.....

తీవ్ర కిడ్నీ సమస్యతో వచ్చిన మూడేళ్ల చిన్నారికి సకాలంలో ఉచిత చికిత్స.....

వైద్యుల పర్యవేక్షణలో ఆకాష్ ఆరోగ్యం మెరుగుదల.....

**పోరు తెలంగాణ సెప్టెంబరు 17: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** తీవ్ర కిడ్నీ సమస్యతో పాటు శరీరం, ముఖం వాపుతో ఆసుపత్రికి వచ్చిన మూడేళ్ల చిన్నారికి కుమురం భీం ఆసిఫాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వైద్యులు సకాలంలో చికిత్స అందించి ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరిచారు. జైనూర్ మండలం బాపుగూడెం గ్రామానికి చెందిన సిదాం శ్రీకాంత్ కుమారుడు సిదాం ఆకాష్ (3) అనారోగ్యంతో ఆసుపత్రికి రాగా, సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రవి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. చిన్నారిని వెంటనే ఆసుపత్రిలో చేర్పించి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వైద్యుల పర్యవేక్షణలో తగిన చికిత్స అందించడంతో ఆకాష్ చికిత్సకు సానుకూలంగా స్పందిస్తున్నాడని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్యం మెరుగుపడుతున్నట్లు వెల్లడించారు.

**ప్రజలకు అందుబాటులో ఉచిత వైద్యం**

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలకు చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. తమ బిడ్డకు సకాలంలో మెరుగైన వైద్యం అందించిన వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర ఆసుపత్రి సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది నిరంతరం కృషి చేస్తున్నారని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సేవలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

## బెయిల్ ఇచ్చేందుకు లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిన కీసర సీఐ, ఎస్సై !




**పోరుతెలంగాణ న్యూస్ //కీసర :** మేడ్చల్ జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి సీఐ ఆంజనేయులు, ఎస్సై జ్ఞానేందర్ రెడ్డిని ఏసీబీ అరెస్ట్ చేసింది. ఓ కేసులో బెయిల్ ఇచ్చేందుకు నిందితుడి నుంచి సీఐ ఆంజనేయులు రూ. 10 లక్షలు డిమాండ్ చేసి, బిర్యానీలు, కూల్డ్రింక్స్ తెమ్మని వేధించాడు. దీంతో నిందితుడు ఏసీబీని ఆశ్రయించాడు. సీఐ ఆదేశాల మేరకు రూ.5 లక్షలు లంచం తీసుకుంటున్న ఎస్సైని కీసర చెరువుగట్టు వద్ద అధికారులు పట్టుకున్నారు.